
ఈఎన్‌సీ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్‌గా శాంతాను ఝా



రియర్ అడ్మిరల్ శాంతాను ఝా

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (ఆపరేషన్స్)గా రియర్ అడ్మిరల్ శాంతాను ఝా నియమితులయ్యారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ చేసిన ఆయన 1993లో నేవీలో చేరారు. నేవిగేషన్, డైరెక్షన్‌లో ఆయన నిష్ణాతులు. ఫ్రంట్‌లైన్ ఫ్రిగేట్స్, డెస్ట్రాయర్స్‌తో పాటు ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విరాట్‌లో ఆయన నేవిగేషన్ అధికారిగా పనిచేశారు. ఐఎన్ఎస్ విక్రమాదిత్యకు ఎగ్జిక్యూటివ్ అధికారిగా పనిచేశారు. నిశాంక్, కోరా, సహ్యాద్రి నౌకలకు సారథ్యం వహించారు.

జనసంచారం లేని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి



బోసిపోయిన నగరం

రహదారులన్నీ నిర్మానుష్యం

- సగం జనం పల్లెలకు పయనం
- కనుమ నాడు చికెన్ సెంటర్ల వద్ద సందడి
- ఉమ్మడి జిల్లాలో ఒక్కరోజే ఆరేడు లక్షల కోళ్ల విక్రయం
- మద్యం దుకాణాల్లో అంతంత మాత్రంగా అమ్మకాలు
- పట్టపగలు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నిత్యం రద్దీగా ఉండే నగర రహదారులు బోసిపోయాయి. కనుచూపు మేర వాహనాల సందడే లేదు. రెండు రోజుల క్రితం వరకూ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయిన ప్రధాన జంక్షన్లన్నీ సోమ, మంగళవారాల్లో నిర్మానుష్యమైపోయాయి. సంక్రాంతి సెలవుల ప్రభావం చాలా స్పష్టంగా కనిపించింది. విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం నగరానికి వలసవచ్చిన వారు సంక్రాంతి పండుగకు కుటుంబాలతో సహా స్వగ్రామాలకు వెళ్లిపోయారు. దాంతో నగరంలో జనసంచారం తగ్గింది. స్థానికులు, ఉద్యోగ రీత్యా దూరప్రాంతాలకు వెళ్లలేని వారు మాత్రమే మిగిలారు. వీధుల్లో, రహదారుల పక్కన టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్ బళ్లు అన్నీ మూతపడ్డాయి. బ్యాచిలర్లు రెడీమేడ్ ఫుడ్ కోసం వెదుకులాడారు. తప్పనిసరి స్థితిలో పెద్ద హోటళ్లను ఆశ్రయించారు.



ఎంపీపీ కాలనీ రైతుబజార్ వద్ద చికెన్ కోసం వేచివున్న జనం

చికెన్ దుకాణాలకు తాకిడి

కనుము పండుగ మంగళవారం రావడంతో నగరవాసులు ఉదయం నుంచే చికెన్, మటన్ దుకాణాల వద్ద క్యూ కట్టేశారు. ఎంవీపీ కాలనీ, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, పూర్ణామార్కెట్, సీతంపేట, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో చికెన్, మటన్ దుకాణాల వద్ద జనం అధికంగా కనిపించారు. నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో చికెన్ వ్యాపారం అంచనాకు అనుగుణంగా జరిగిందని బ్యాగ్ అధ్యక్షుడు కొట్యాడ శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మంగళవారం ఒక్కరోజు ఆరు నుంచి ఏడు లక్షల కోళ్ల అమ్మకాలు జరిగాయన్నారు. ఆదివారం భోగి కావడంతో వ్యాపారం ఒక మోస్తరుగా జరిగిందని, పేర్కొంటూ కనుమ రోజు అమ్మకం బాగుందన్నారు. అయితే నాటు కోళ్ల ధరలు అమాంతం పెంచేశారు. లైవ్ కిలో నాటు కోడి రూ.650 నుంచి రూ.800 వరకు విక్రయించారు. చివరకు గిరిరాజా కోళ్లు కూడా కిలో రూ.400 నుంచి రూ.500 వరకు అమ్మడం గమనార్హం.

పోలీసులు అప్రమత్తం

నగరంలో జనాలు తక్కువగా ఉన్నా పోలీసులు మాత్రం అప్రమత్తంగానే ఉన్నారు. తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉండడంతో గస్తీని పెంచారు. రాత్రి పూట ఎస్ఐలు, సీఐలు బీట్లు తిరుగుతూ అనుమానంగా కనిపించిన వారిని ప్రశ్నించారు. సోమవారం సంక్రాంతి కావడంతో కొందరు బీచ్‌కు వచ్చి గాలిపటాలు ఎగురవేశారు. అయితే హైదరాబాద్‌లో గాలిపటం దారం మెడకు తగిలి విశాఖపట్నానికి చెందిన ఓ ఆర్మీ ఉద్యోగి చనిపోవడంతో ఇక్కడి పోలీసులు బీచ్‌లో గాలిపటాలు ఎగురవేయకుండా, వచ్చిన వారి నుంచి సరంజామా తీసుకున్నారు. మంగళవారం కనుమ పండుగ కావడంతో మద్యం దుకాణాల వద్ద ఉదయం నుంచే సందడి మొదలైంది. సాధారణంగా రాత్రిపూట డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించే పోలీసులు మంగళవారం ఉదయం నుంచే బ్రీత్ ఎనలైజర్లను పట్టుకొని వాహనాలపై వెళ్లేవారిని ఆపి పరీక్షించడం ఆశ్చర్యం కలిగించింది. రోడ్లపై వాహనాల సంచారం అంతంత మాత్రంగానే ఉన్నా మద్యం తాగి వాహనాలు నడిపితే సెల్ఫ్ యాక్సిడెంట్లు చేసుకునే అవకాశం ఉందని, అందుకే తనిఖీలు నిర్వహించామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అయితే మద్యం అమ్మకాలు ఒక మోస్తరుగా జరిగాయంటున్నారు. పండుగ మూడు రోజులు కలిపి రూ.40 కోట్ల వరకూ జరిగి ఉంటాయని అంచనా.

కమ్మేసిన కాలుష్యం

నగరం ఉక్కిరిబిక్కిరి

- గాలిలో నాణ్యతా ప్రమాణాలు జనవరి నెలలో తొమ్మిది రోజులు 'పూర్', మూడు రోజులు 'వెరీ పూర్'గా నమోదు
- మంచుతో సిటీ నుంచి బయటకు వెళ్లని ధూళి కణాలు
- ప్రభావం చూపిన పారిశుధ్య కార్మికుల సమ్మె
- శ్వాసకోశ వ్యాధులు ప్రబలే ప్రమాదం



పోర్టు రహదారిలో రేగుతున్న ధూళి

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):

విశాఖను కాలుష్యం వెంటాడుతోంది. గాలిలో నాణ్యతా ప్రమాణాలు అత్యంత తక్కువగా ఉంటున్నాయి. ముఖ్యంగా జనవరిలో గాలిలో ధూళి కణాల శాతం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ధూళి కణాల స్థాయిని నిర్ధారించే సూచీ (ఇండెక్స్) ఈ నెలలో తొమ్మిది రోజులు 'పూర్', మరో మూడు రోజులు 'వెరీ పూర్' కేటగిరీ కింద నమోదయ్యాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటలు, తిరిగి సాయంత్రం నాలుగు నుంచి అర్ధరాత్రి దాటేంత వరకు మంచు కురుస్తుండడంతో గాలిలో ధూళి కణాలు నగరంపైనే ఉండిపోతున్నాయి.

శీతాకాలం వచ్చిందంటే నగరంలో కాలుష్యం ఆందోళన కలిగించే స్థాయిలో ఉంటుంది. నగరానికి మూడు వైపులా కొండలు (బౌల్ ఏరియా) ఉండడంతో ధూళి కణాలు బయటకు వెళ్లడానికి అవకాశం ఉండదు. నైరుతి గాలులతో పోర్టు నుంచి బొగ్గు ధూళి కణాలు నగరంపైకి వీస్తుంటాయి. ఇదే సమయంలో మంచు దట్టంగా కురవడంతో ధూళి కణాలు ఎక్కడికక్కడ ఉండిపోతాయి. పోర్టులో బొగ్గు నిల్వలు గడచిన నెల రోజుల నుంచి భారీగా పేరుకుపోవడం, అదే సమయంలో గాలులు వీయడం కాలుష్య తీవ్రత పెరిగేందుకు కారణమైంది. ఇంకా సుమారు రెండు వారాల పాటు పారిశుధ్య కార్మికుల సమ్మె జరగడంతో నగరంలో పేరుకుపోయిన చెత్త నుంచి వెలువడిన ధూళి, కాలుష్యం గాలి నాణ్యత క్షీణించడానికి కారణమైంది. అలాగే నగరంలో భారీఎత్తున చేపడుతున్న భవన నిర్మాణాల నుంచి ధూళి కాలుష్యం ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. నిర్మాణాల చుట్టూ పరదాలు కట్టాలన్న నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. మరోవైపు వాహన కాలుష్యం పెరుగుతూ పోతోంది. దీంతో నగరంలో కాలుష్యం పెరుగోందని పర్యావరణ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. డిసెంబరులోనూ సగం రోజులు కాలుష్య ప్రభావంతో గాలిలో నాణ్యత శాతం సూచీ ఎక్కువగానే నమోదైందని గుర్తుచేశారు. ఈ నెలలో చలి, మంచు ప్రభావంతో కాలుష్యం మరింతగా పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

మొత్తం 12 రోజులు పూర్ కేటగిరీ..

గాలి నాణ్యతను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంపై కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటుచేసిన యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ యంత్రం నిర్ధారిస్తుంది. గాలిలో సూక్ష్మ కణాలు (పీఎం-10), అతి సూక్ష్మకణాలు (పీఎం 2.5), ఇతరత్రా కాలుష్య కారకాలను నమోదుచేస్తుంది. ఒక రోజు అంటే 24 గంటలపాటు ఇక్కడ యంత్రం నమోదు చేసిన డేటాను సగటుగా ... మిగతా 6వ పేజీలో



ఆశీల్‌మెట్టలోని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 'రామబాణం' కళాశాల

అనధికారికంగా కళాశాల నిర్వహణ

- ఇదీ 'సౌత్' ఎమ్మెల్యే వాసుపల్లి నిర్వాకం
- చోద్యం చూస్తున్న ఇంటర్‌బోర్డు అధికారులు

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆశీల్‌మెట్ట జంక్షన్‌లో అనధికారికంగా 'రామబాణం' పేరుతో జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నారు. మర్రిపాలెంలోని రాణాప్రతాప్‌నగర్‌లో రామబాణం జూనియర్ కళాశాల (కోడ్ నంబరు 02029) నిర్వహిస్తున్నారు. అదే పేరుతో గాజువాకలో ఒక కళాశాల ఉంది. రాణాప్రతాప్‌నగర్, గాజువాకల్లో గల కళాశాలలకు ఇంటర్ బోర్డు అనుమతి ఉంది. అయితే రాణాప్రతాప్‌నగర్‌లో గల కళాశాల కోడ్ నంబర్‌తోనే ఆశీల్‌మెట్టలో తన కార్యాలయం భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో 'రామబాణం' కళాశాలను నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలకు ఎమ్మెల్యే వాసుపల్లి డైరెక్టర్‌గా ఉన్నారు. కనుమ పండుగ సందర్భంగా మంగళవారం ఉదయం ఆశీల్‌మెట్టలో గల కళాశాలలోనే దక్షిణ నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలకు మద్యం, కోళ్లు సరఫరా చేశారు. ఒకే నంబరుతో రెండుచోట్ల కళాశాలల నిర్వహణ గురించి ఇంటర్ బోర్డు అధికారులను వివరణ కోరేందుకు యత్నించగా వారెవరూ అందుబాటులో దొరకలేదు.

బంగ్లాదేశ్ నౌకకు మోక్షమెన్నడో?

పర్యాటక ప్రాజెక్టుగా మారుస్తామని మూడేళ్ల కిందట పాలకుల ప్రకటన

- అనుమతుల కోసం అప్పటినుంచీ ప్రయత్నాలు
- ఇప్పటికీ అతీగతి లేదు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

బంగ్లాదేశ్ నౌక తెన్నేటి పార్కు తీరానికి కొట్టుకువచ్చి మూడేళ్లు పూర్తయినా దానికి ఇంకా మోక్షం కలగలేదు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పర్యాటక శాఖా మంత్రిగా ఉండగా దానిని ప్రజా సందర్శనకు వీలుగా మారుస్తామని ప్రకటించారు. కానీ అది ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. కొత్త పర్యాటక శాఖా మంత్రి దాని గురించి ఒక్కమాట కూడా మాట్లాడడం లేదు. అధికారులు మాత్రం ఫైల్ మీద ఫైల్ పెడుతూ దానిని ఎలాగోలా వినియోగంలోకి తేవాలని యత్నిస్తున్నారు. అవి ఎప్పటికి ఫలిస్తాయో!!

బంగ్లాదేశ్ నౌక 'ఎంవీ మా'



తుఫాన్ గాలులకు మూడేళ్ల క్రితం తెన్నేటి పార్కు తీరానికి బంగ్లాదేశ్ వాణిజ్య నౌక 'ఎంవీ మా' కొట్టుకువచ్చింది. వెనక్కి తీసుకువెళ్లే మార్గం లేకపోవడంతో అలాగే వదిలేయాలని సంస్థ నిర్ణయించింది. ఆ నౌకను పర్యాటకంగా ఉపయోగించుకోవాలని అప్పటినుంచీ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది. నౌకను యాజమాన్యం నుంచి గిల్‌మెన్ సంస్థ తీసుకుంది. ఏపీ పర్యాటక శాఖతో గిల్‌మెన్ సంస్థ ఒప్పందం చేసుకుంది. నౌకను ఏ విధంగా కావాలంటే ఆ విధంగా తయారుచేసి ఇస్తామని హామీ ఇచ్చింది. దీనిని రెండు దశల్లో అభివృద్ధి చేయాలని అధికారులు భావించారు. కురుసుర సబ్‌మెరైన్‌ను ఎలాగైతే పర్యాటక ప్రాజెక్టుగా మార్చారో..దీనిని కూడా అలాగే తీర్చిదిద్దాలని నిర్ణయించారు. వాణిజ్య నౌక ఎలా ఉంటుంది?, అందులో యంత్రాలు, క్రూ (సిబ్బంది) గదులు, సరకు రవాణాకు నౌకను ఎలా ఉపయోగిస్తారు?..వంటి అంశాలు సాధారణ ప్రజలకు వివరించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. లభించే ఆదరణను బట్టి ఆ తరువాత దశలో రెస్టారెంట్, ఎంటర్‌టెయిన్‌మెంట్ వంటి అంశాలు జోడించాలని అనుకున్నారు.

రెండు అనుమతుల కోసం యత్నం

తీరానికి కొట్టుకువచ్చిన నౌక వద్దకు జోడుగుళ్లపాలెం బీచ్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అదంతా ఇసుక. రహదారి వేయాలి. ఆ ప్రాంతం అటవీ శాఖకు సంబంధించినది కావడంతో వారి అనుమతి కోసం ఫైలు పంపించారు. సుమారు 0.5 హెక్టార్ల భూమి కావాలని, పర్యాటక అవసరాలకు ఉపయోగిస్తామని రాశారు. ఇక్కడి జిల్లా అటవీ శాఖాధికారి నుంచి కేంద్ర కార్యాలయం వరకూ దానిని పరిశీలించాల్సి ఉంది. ఇటీవల ఈ ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే ప్రాసెస్ చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక సమస్యతో ఆ పోర్టల్ ఆగింది. సమస్య పరిష్కారం అయిన వెంటనే అనుమతి లభిస్తుందని పర్యాటక శాఖాధికారులు ... మిగతా 6వ పేజీలో

పండగపూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి
- భార్యా భర్త...అతని సోదరుడి కుమారుడు



ప్రమాద దృశ్యం

దత్తిరాజేరు/ఎండాడ, జనవరి 16: పండక్కి స్వస్థలానికి వెళ్లిన నగరంలోని ఎండాడ ప్రాంతవాసులు ముగ్గురు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురంలోని బెలగాం ప్రాంతానికి చెందిన నలితం సత్యనారాయణ (50), ఆయన భార్య నరసకుమారి (43), సత్యనారాయణ సోదరుని కుమారుడు నలితం మహేష్ (27) ఎండాడలో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు కారులో బెలగాం వెళ్లారు. మంగళవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం రాత్రి ఏడు గంటలకు విజయనగరం జిల్లా ... మిగతా 6వ పేజీలో

నగరంలో అంధకారం



పోర్టు ఆస్పత్రి వద్ద జాతీయ రహదారిపై వెలగని విద్యుద్దీపాలు

జాతీయ రహదారి సహా పలు ప్రాంతాల్లో వెలగని వీధిదీపాలు

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు నగరంలో సగం మంది స్వగ్రామాలకు వెళ్లిపోవడంతో ట్రాఫిక్ బాగా తగ్గిపోయింది. రహదారులన్నీ బోసిపోయాయి. అత్యధికం వ్యాపార సంస్థలు షట్టర్లు కూడా తెరవలేదు. నగరంలో పెద్దగా ప్రజలు లేనప్పుడు విద్యుత్‌ను వృథా చేయడం ఎందుకని అనుకున్నారేమో..మంగళవారం రాత్రి సగం ప్రాంతాల్లో వీధి దీపాలు వేయలేదు. జాతీయ రహదారి మొత్తం చీకటిమయం అయిపోయింది. కేవలం ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు, వాహనాల వెలుతురు తప్పితే మరో వెలుగు లేదు. అలాగే సీతమ్మధార, మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, ఇలా అనేక ప్రాంతాల్లో వీధి దీపాలు వేయలేదు.

టెస్ట్ మ్యాచ్ టికెట్లపై అయోమయం

- ఆన్‌లైన్‌లో ఐదు రోజుల సీజన్ టికెట్లు
- కనిపించని రోజువారీ టికెట్లు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జనవరి 16: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య వచ్చే నెల రెండో తేదీ నుంచి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించి ఆన్‌లైన్ (పేటీఎం ఇన్‌సైడర్)లో ద్వారా చేపట్టిన టికెట్ల అమ్మకాలకు స్పందన అంతంతమాత్రంగానే ఉంది. విక్రయాలు (ఈనెల 15 నుంచి) ప్రారంభించి రెండు రోజులైనా ఇప్పటికీ టికెట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ... మిగతా 6వ పేజీలో

పోలమాంబ ఉత్సవాలకు చాటింపు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

జగదాంబ కూడలి, జనవరి 16: గ్రేటర్ 30వ వార్డు కుమ్మరవీధిలో పోలమాంబ అమ్మవారి 66వ వార్షిక మహోత్సవాలకు సంబంధించి మంగళవారం చాటింపు వేశారు. సంప్రదాయం ప్రకారం కుమ్మరవీధి, సాలిపేట, తాడివీధి, జెండాచెట్టు, ఏనుగుల వీధి ప్రాంతాల్లో డప్పు చాటింపుతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 21న తొలేళ్ల సంబరాలు, 23న మహోత్సవం (పరస) ను నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు వివరించారు. అదేవిధంగా 19వతేదీన ఉత్సవరాట మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నట్టు చెప్పారు. కనుమ పండుగ పురస్కరించుకుని అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుద్ధుని విగ్రహావిష్కరణ



మురళీనగర్ పార్కులో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మురళీనగర్, జనవరి 16 ; గ్రేటరు 50వవార్డు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని మంగళవారం పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అధ్వర్యంలో పార్కు వ్యవస్థాపక సభ్యులైన ఎన్.బుచ్చయ్య చౌదరి ఆవిష్కరించారు. అన్ని వసతులతో పెద్దలకు, పిల్లలకు చేరువైన పార్కులో బుద్ధుని విగ్రహం ఏర్పాటు మరింత శోభ చేకూరుస్తుందని ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. కాలనీ వాసులు, క్లబ్ సభ్యులు కార్యక్రమంలో ఉన్నారు.

పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల నియామకంపై హర్షం

మహారాణిపేట, జనవరి 16: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా అధిష్టానం వైఎస్ షర్మిలని నియమించడంపై ఆ పార్టీ నగర జిల్లా అధ్యక్షులు గొంప గోవింద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు.దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ప్రస్తుతం చాలా అవసరమన్నారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున కార్గే నాయకత్వంలో కేంద్రంలో, వైఎస్ షర్మిల, గిడుగు రుద్రరాజు, పార్టీ సీనియర్ నాయకులసారథ్యంలో రాష్ట్రంలో ఎన్నికలకు వెళ్లి విజయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంతోనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా,విభజనహామీలతోపాటుఅభివృద్ధి, సంక్షేమం అమలవుతాయన్నారు.



గెడ్డలో పేరుకుపోయిన చెత్త



నరేంద్రనగర్‌లో ఇళ్ల ఎదుట నిలిచిన మురుగునీరు

గెడ్డలో పూడికలతో అవస్థలు

- తొలగింపులో జీవీఎంసీ నిర్లక్ష్యం
- యంత్రాంగంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ ఆగ్రహం

అక్కయ్యపాలెం, జనవరి 16 : గ్రేటర్ 43వ వార్డు నరేంద్రనగర్, నందగిరినగర్ మధ్యలో ఉన్న గెడ్డలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ జీవీఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక నాయకులతో కలసి ఆయన గెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత 15 ఏళ్ల క్రితం బాణ సంచా తయారు చేసే సమయంలో ప్రమాదం జరిగిందని, అప్పట్లో ఈ గెడ్డలో ఉన్న చెత్తను తొలగించారన్నారు. అప్పటినుంచి పూడికలు తొలగించకపోవడంతో గెడ్డలో మురుగునీరు రోడ్డుపైకి, ఇళ్లలోకి వచ్చేస్తుందన్నారు. దీని వల్ల దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. ఇంతగా ఇబ్బంది ఎదుర్కొంటున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యాధులు ప్రబలుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్త తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్య క్షుడు మొల్లేటి కుమారస్వామి, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకా సత్యకిరణ్, స్థానికులు మహేష్, పి.రామకృష్ణ, టి.శ్రీనివాస్, జె.సత్యనారాయణ ఉన్నారు.



గెడ్డను పరిశీలిస్తున్న టీడీపీ నేత లొడగల కృష్ణ

రహదారులు ఘోరం... వాహనదారులకు నరకం

- అడుగడుగునా గోతులు
- వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు
- డాబాగార్డెన్స్ పరిధిలో దుస్థితి



డాబాగార్డెన్స్ నుంచి పెన్ స్కూల్ వైపుగా వెళ్లే మార్గంలో గోతులు

డాబాగార్డెన్స్, జనవరి 16: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ పలు ప్రాంతాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డాబాగార్డెన్స్ శారదాస్ట్రీట్, సరస్వతీ పార్కు సర్కిల్ ప్రధానరహదారులు దెబ్బతిన్నాయి. అడుగుకో పెద్ద గొయ్యి పడడడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు డాబాగార్డెన్స్ నుంచి అంబేద్కర్ సర్కిల్ సరస్వతీ పార్కు నుంచి జగదాంబ తదిర ప్రాంతాలు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో రహదారులు ఘోరంగా మారడంతోపాటు వాహనదారులు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆయాప్రాంతాల్లోకి ఏమరుపాటు వచ్చేవారు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. చాలామంది వాహనదారులు గోతుల్లో పడి వెన్నునొప్పు బాధతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.లేకుంటే రహదారులతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని వాపోతున్నారు.



రహదారిపై పెద్దగొయ్యి..



సరస్వతీ పార్కు సర్కిల్‌లో ..

పద్య నాటకాల్లో అప్పలసూరిది ప్రత్యేకముద్ర



అప్పలసూరి జన్మదినోత్సవంలో ప్రతినిధులు

అక్కయ్యపాలెం, జనవరి 16: పద్యనాటక నటుడు, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు పొన్నాన అప్పల సూరి నేటితరం నటులకు ఆదర్శమూర్తి అని చైతన్య సమితి అధ్యక్షుడు బీవీ అప్పారావు కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎరగాం గ్రామానికి చెందిన డాక్టర్ పొన్నాన అప్పలసూరి 90వ జన్మదిన వేడుకలు నగరంలోని ఇసుకతోటలోని ఆయన కుమారుడు స్వగృహంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పౌరాణిక నాటకాల్లో అప్పలసూరి ప్రత్యేక ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ నాన్ టీచింగ్ స్టాఫ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కమ్మేసిన కాలుష్యం

... 5వ పేజీ తరువాయి

తీసుకుని గాలిలో నాణ్యత శాతాన్ని నిర్ధారిస్తారు. ఈ నెలలో ఒకటో తేదీ నుంచి మంగళవారం వరకు నగరంలో గాలిలో నాణ్యత శాతాన్ని నిర్ధారించే సూచీ (ఇండెక్స్) పరిశీలిస్తే 5, 6, 7, 16 తేదీల్లో తప్ప మిగిలిన 12 రోజుల్లో తొమ్మిది రోజులు 'పూర్' (నాసిరకం), 3, 11, 14 తేదీల్లో వెరీపూర్ (అత్యంత నాసిరకం)గా నమోదైంది. వెరీ పూర్‌గా నమోదైన మూడో తేదీన ఇండెక్స్ 316, 11వ తేదీన 302, 14వ తేదీన 315గా నమోదుకావడం ఆందోళన కలిగిస్తోంది. భోగి పండుగ సందర్భంగా వీధుల్లో వేసిన మంటల నుంచి వచ్చిన పొగ నగరాన్ని కమ్మేసింది. దీంతో గాలిలో నాణ్యత ప్రమాణాలు పడిపోవడంతో 14వ తేదీన సూచీ 315గా నమోదైంది. కాలుష్య నియంత్రణ మండలి సూచీ ప్రకారం 200 నుంచి 300 వరకు నమోదైతే గాలి పీల్చుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. అదే సూచీ 301 నుంచి 400 వరకు నమోదైతే శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతాయి.

పీఎం 2.5 అత్యంత ప్రమాదకరం

గాలిలో ధూళి కణాలను రెండు రకాలుగా నమోదుచేస్తారు. ఒకటి పీఎం 2.5. ఇవి అతి సూక్ష్మమైనవి. ప్రమాదకరమైనవి. అతి సూక్ష్మమైన ఈ ధూళి కణాలు శ్వాస పీల్చుకున్నప్పుడు లోనికి వెళ్లి ఊపిరితిత్తులలో ఉండిపోతాయి. ఇక రెండోది పీఎం 10. గాలి పీల్చినప్పుడు పీఎం 10ను ముక్కు నిలువరిస్తోంది. అయితే ఇది కూడా పరిమితికి మించితే ప్రమాదమే.

బంగ్లాదేశ్ నౌకకు మోక్షమెన్నడో?

... 5వ పేజీ తరువాయి

విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు.

సీఆర్‌జెడ్ బోర్డు సమావేశంలో కొర్రీలు

నౌక నిలిచిపోయిన ప్రాంతం కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) పరిధిలో ఉంది. అక్కడ ఎటువంటి కార్యక్రమం చేపట్టాలన్నా వారి అనుమతి కూడా అవసరం. ఈ ఫైల్‌ను కూడా అక్కడకు పంపించారు. ఇటీవల జరిగిన సీఆర్‌జెడ్ బోర్డు సమావేశంలో ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని మరిన్ని వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. తరువాత జరిగే బోర్డు సమావేశంలో వాటిపై చర్చించాక అనుమతిపై నిర్ణయం తీసుకుంటారు.

ప్రజలకు మంచి అనుభూతి ఇవ్వాలనే...

- శ్రీనివాస పాని, రీజనల్ డైరెక్టర్, పర్యాటక శాఖ

ఎందుకూ ఉపయోగపడని నౌకను పర్యాటకంగా ఉపయోగించుకుంటే మరో కురుసుర సబ్‌మెరైన్‌లా అందరికీ చక్కటి అనుభూతిని ఇస్తుందని ప్రభుత్వం తరఫున యత్నిస్తున్నాము. అనుమతులు చివరి దశలో ఉన్నాయి. రాగానే మ్యూజియంగా, రెస్టారెంట్‌గా తీర్చిదిద్దుతాము. ఇవన్నీ ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పనులు కావడం వల్ల బయట అన్నీ తయారుచేసి ఇక్కడికి తెచ్చి నౌకలో ఏర్పాటుచేస్తారు.

ఘనంగా భజనచెట్టు ఉత్సవం



భజన చెట్టువద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

జ్ఞానాపురం, జనవరి 16 : రామలీలపరసమహోత్సవం సందర్భంగా శ్రీగ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో భజనచెట్టు ఉత్సవం మంగళవారం ఘనంగా జరిపారు. రామాలయంలో భజనచెట్టుకు పూజలు నిర్వహించి తిరువీధి ఉత్సవం జరిపారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, పాల్గొని పూజలు చేశారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు దాడి సూర్య అప్పారావు, మళ్ల శంకరరావు, రామ భజన సమాజం అధ్యక్షుడు కాళ్ల సూరిబాబు, మళ్ల శివాజీ భజనచెట్టుకు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

తీర్థాలతో సందడే... సందడి

జ్ఞానాపురం, జనవరి 16: సంక్రాంతి నుంచి తీర్థాలు (పరసలు) ప్రారంభం కానున్నాయి. గ్రామీణప్రాంతాల్లో జరిగే తీర్థాల మాదిరిగా నగరంలో పలు ప్రాంతాల్లో శ్రీరామలీలా పరసమహోత్సవాలను ఏటా నిర్వహిస్తుంటారు. నగరంలో అల్లిపురం, వెంకటేశ్వరమెట్ట ప్రాంతాలతోపాటు గవరకంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, మర్రిపాలెం, కరసా, బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో ఈ పరస ఉత్సవాలు రోజూఏదో చోట కనిపిస్తుంటాయి. ఈ ఉత్సవాల్లో సాముగారడీలు, తప్పటగుళ్లు, పులివేషాలు, కోలాటాలు తదితర కళాప్రదర్శనలు పిల్లలు, పెద్దలను ఆనందాన్ని పంచుతాయి. కను మ రోజు ప్రారంభమయ్యే ఈ పరసలు మూడునాలుగు నెలల పాటు పలుచోట్ల కొనసాగుతాయి. ఈ జాతర్లలో పిల్లలు ఆడుకునే రకరకాల బొమ్మలను విక్రయిస్తుంటారు. వాటితోపాటు వారు వివిధ తినుబండారాలు ఉంటాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తాయి. చిన్నారులను ఆకాశంలో విహరింపజేయడానికి రంగులరాట్నం.. పంచదార చిలకలు ..ఖర్జూరం... చెరకుగడలు...రంగురంగుల బెలూన్ల విక్రయాలు జోరుగా సాగుతాయి.

కనకమహాలక్ష్మి ఆలయంలో 'కనుమ '

- గోవులకు భక్తి శ్రద్ధలతో పూజలు

జగదాంబ కూడలి, జనవరి 16: వన్‌టౌన్ బూరుజుపేటలో కనక మహాలక్ష్మి ఆలయంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం కనుమ పురస్కరించుకుని సాంప్రదాయబద్ధంగా గోవులకు ఈవో కె.శిరీష, అధికారులు, సిబ్బంది పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతలను ప్రత్యేకంగా అలంకరించారు.



గోమాతకు పూజలు చేస్తున్న దేవస్థానం అధికారులు



అమ్మవారికి పద్మారాధన సేవ

ఈ వేడుకల్లో నగరంలోని వివి.ధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి అష్టదశ పద్మారాధన సేవలు

కనకమహాలక్ష్మికి అమ్మవారికి మంగళవారం అ ష్టదశ పద్మారాధన సేవల్లోభాగంగా 108 స్వర్ణపుష్పాలతో ఆలంకరిం చి పూజలను జరిపారు. తెల్లవారుజామున నిర్వహించిన పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు.

కొత్త అల్లుడికి 300 రకాలకుపైగా వంటకాలతో సంక్రాంతి ఆతిథ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 16: తెలుగు వారికి పెద్ద పండుగ సంక్రాంతి. కొత్త అల్లుళ్లకు అత్తింటివారు తమ స్థోమతకు తగ్గట్టుగా మర్యాదలు చేస్తుంటారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లి దుర్గా లాడ్జి వీధికి చెందిన గుండా సాయిగోపాల్, మాధవి దంపతులు సంక్రాంతిని పురస్కరించుకుని తమ అల్లుడికి 300 రకాలకుపైగా వంటకాలతో ఆతిథ్యం ఇచ్చారు.

వందలాది రకాల స్వీట్లు, తినుబండారాలు, 15 రకాల కూరలు అరటి ఆకుపై వడ్డించారు. సాయిగోపాల్ దంపతుల కుమార్తె రిషితకు డిసెంబరులో విశాఖకు చెందిన దేవేంద్రనాథ్‌తో వివాహమైంది. పెళ్లయిన తరువాత వచ్చిన మొదటి పెద్ద పండుగ కావడంతో పాటు ఇప్పటి వరకు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఇటువంటి సంప్రదాయాన్ని అనకాపల్లికి కూడా విస్తరింపజేయాలని ఉద్దేశంతో ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు సాయిగోపాల్ తెలిపారు.



నూతన దంపతులకు వడ్డించిన పదార్థాలు

పండగపూట విషాదం

... 5వ పేజీ తరువాయి

దత్తిరాజేరు మండలం కోమటిపల్లి కూడలి వద్దకు వచ్చేసరికి ముందున్న లారీని ఓవర్‌టేక్ చేసే యత్నంలో విశాఖ నుంచి పార్వతీపురం వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసకుమారి, మహేష్ సంఘటనా స్థలంలో చనిపోగా, సత్యనారాయణ ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయినట్టు దత్తిరాజేరు ఇన్‌చార్జి ఎస్ఐ మహేశ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.

టెస్ట్ మ్యాచ్ టికెట్లపై అయోమయం

... 5వ పేజీ తరువాయి

ఆన్‌లైన్‌లో కేవలం ఐదు రోజుల సీజన్ టికెట్లు (రూ.400, రూ.800, రూ.1000) మాత్రమే ఉన్నాయి. నిర్వాహకులు ప్రకటించిన రూ.1500 టికెట్లు కనిపించడం లేదు. కనీసం అమ్ముడైపోయినట్టు (సోల్డ్ అవుట్) కూడా చూపడం లేదు. ఇక రూ.100, 200, రూ.300, రూ.500 ధర గల రోజువారీ టికెట్ల విక్రయాలపై అయోమయ పరిస్థితి నెలకొంది. పేటీఎం ఇన్‌సైడర్‌లో రోజువారీ టికెట్లు అమ్ముడైయినట్టు చూపకపోవడంతో క్రీడాభిమానులలో అనుమానాలు నెలకొన్నాయి. ఐదు రోజుల సీజన్ టికెట్లకు సంబంధించి మంగళవారం రాత్రి సమయానికి ఎం, ఎం-1 స్టాండ్‌లో రూ.400, 'ఎఫ్' స్టాండ్‌లో రూ.800 టికెట్లు, అలాగే సౌత్ వెస్ట్ అప్పర్ స్టాండ్, సౌత్ ఈస్ట్ అప్పర్ స్టాండ్‌తోపాటు జీ, వో, ఐ స్టాండ్స్‌లో రూ.1000 టికెట్లు అందుబాటులో ఉన్నట్టు పేటీఎం ఇన్‌సైడర్‌లో చూపుతున్నాయి. రూ.1500 ధర గల సీజన్ టికెట్లు, అలాగే రూ.100, 200, రూ.300, రూ.500 ధర గల రోజువారీ టికెట్లకు సంబంధించి ఇన్‌సైడర్‌లో ఎటువంటి సమాచారం కనిపించడం లేదు.



బాల్వాడీ భవనం గోడపై మొలచిన చెట్టు



శిథిల భవనంలో చిన్నారులు

భయం నీడన చిన్నారులు

- సింహగిరి కాలనీలో శిథిలావస్థలో బాల్వాడీ భవనం
- బీటలు వారిన భవనాలతో పొంచి ఉన్న ప్రమాదం

అక్కయ్యపాలెం, జనవరి 16: గ్రేటర్ 45వ వార్డు సాలిగ్రామపురం సమీపం కొండవాలు ప్రాంతమైన సింహగిరి కాలనీలోని శిథిలావస్థకుచేరిన బాల్వాడీ భవనంలో చిన్నారులకు బోధన కొనసాగుతోంది. దీంతో చిన్నారులకు ఏ క్షణంలో ప్రమాదం సంభవిస్తోందని తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ కాలనీ 1982 సంవత్సరంలో ఆవిర్భవించింది. 1985లో స్థానికుల పిల్లల చదువుకునేందుకు వీలుగా అప్పటి మున్సిపల్ కార్పొరేటర్ చొరవతో ఈ బాల్వాడీ భవనాన్ని నిర్మించారు. మూడు దశాబ్దాలు గడవడంతో భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీనికి మరమ్మతులు లేదా పునఃనిర్మాణానికి చేపట్టేందుకు చర్యలు చేపట్టలేదు.

ఈ కేం ద్రంలో సుమారుగా 25 మంది చిన్నారులు చదువుతున్నారు. శిథిలావస్థలోని ఈ భవనం కూలిపోయి చిన్నారులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వర్షాలు, ఈదురు గాలులు వస్తే భవనంలో ఉన్న చిన్నారుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆ భవనానికి ఉన్న గోడకు ఆనుకుని ఓ చెట్టు మొలిచింది. దాన్ని తొలగిస్తే భవనం కూలిపోయే ప్రమాదం ఉందంటున్నారు. భవనం లోపల, బయట గోడలు పగిలిపోయాయి. ఈనేపథ్యంలో ఆ భవనాన్ని కూలగొట్టి నూతన భవనాన్ని నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మునగపాకలో ఎడ్లబండి పోటీలకు విశేష స్పందన



ఎడ్ల పరుగు పోటీల దృశ్యం

మునగపాక, జనవరి 16 : సంక్రాంతిని పురస్కరించుకుని మునగపాక బైపాస్ రోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఎడ్లబండి పోటీలకు విశేష స్పందన కనిపించింది. ఈ పోటీలను చూడడానికి వేలాదిమంది రావడంతో బైపాస్ ప్రాంతమంతా కిక్కిరిసింది. పోటీలను మాజీమంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. అలాగే ఈ కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కూంద్రపు అప్పారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ప్రథమ బహుమతి సంపత్ వినాయక (నర్సాపురం), ద్వితీయ బహుమతి అద్దేపల్లి పాలవెల్లి (చుక్కపల్లి), తృతీయ బహుమతి గండి వెంకటరావు (వాయిలపాడు), నాలుగో బహుమతి అభయ ఆంజనేయస్వామి (సింహాద్రిపురం), ఐదో బహుమతి మరిడిమాంబ (బుచ్చియ్యపేట)లకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు.

రైల్వే ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

విశాఖపట్నం, జనవరి 16: సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల భద్రత, సౌకర్యాల నిర్వహణపై డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన స్టేషన్లలో అదనపు ఆర్పీఎఫ్ సిబ్బందిని నియమించారు. రద్దీని నియంత్రించేందుకు ప్రయాణికులు రైలెక్కే సమయంలో రిజర్వేషన్, సాధారణ కోచ్‌ల వద్ద ప్లాట్‌ఫామ్‌పై క్యూ పాటించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైళ్ల రాకపోకలపై ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారమందించాలన్నారు. ప్రయాణికుల సహాయ చర్యలు చేపట్టేందుకు ప్రధాన స్టేషన్లలో వైద్య బృందాలను ఏర్పాటు చేయడంతోపాటు ఆర్పీఎఫ్, టీటీఈ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాల్స్, రిటైరింగ్ రూమ్స్ వద్ద ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. సంక్రాంతి ప్రయాణికుల రాకపోకల సౌకర్యార్థం వివిధ ప్రాంతాలకు 45 ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టి దాదాపు వంద ట్రిప్పులతో రాకపోకలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

- రూ.95,550 స్వాధీనం

సీతంపేట, జనవరి 16: నాలుగోపట్టణ పోలీసు స్టేషన్ పరిధి సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని ఓ అపార్టుమెంట్‌లో టాస్క్‌ఫోర్సు పోలీసులు, నాలుగో పట్టణ పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.95,550లు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.



శ్రీహరిపురంలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

మొరాయించిన ఆర్టీసీ బస్సు

భయాందోళనకు గురైన ప్రయాణికులు

మల్కాపురం, జనవరి 16: శ్రీహరిపురం ప్రధాన కూడలిలో గాజువాక ఆర్టీసీ డిపోకు చెందిన 400-పై నంబర్ గల బస్సు మరమ్మతుకు గురైంది. సుమారు 50 మంది ప్రయాణికులతో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎలమంచిలి వెళ్తున్న బస్సు శ్రీహరిపురం మహాత్మాగాంధీ మార్కెట్ వద్దకు వచ్చేసరికి కుదుపులకు గురై ఆగిపోయింది. అయితే ఒక్కసారిగా బస్సు కుదుపులకు గురవ్వడంతో ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రత్తమైన డ్రైవర్ రోడ్డు పక్కన బస్సును నిలిపివేశారు. అనంతరం వారిని కండక్టర్ వేరే బస్సు ఎక్కించి పంపించారు. గాజువాక ఆర్టీసీ డిపోలో దాదాపుగా అన్ని బస్సుల పరిస్థితి ఇలాగే ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవలే శ్రీహరిపురంలో ఒకేసారి రెండు బస్సులు మరమ్మతులకు గురైన సంగతి తెలిసిందే. అందువల్ల ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్సుల కండిషన్‌పై దృష్టిసారించి నడిచేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

భూలోకరెడ్డికి నివాళి

పెదగంట్యాడ, జనవరి 16: ఉక్కు నిర్వాసితుల సంఘం మాజీ అధ్యక్షుడు పులి భూలోకరెడ్డికి నిర్వాసిత సంఘం నాయకులు మంగళవారం నివాళులర్పించారు. పెదగంట్యాడ జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం భూలోకరెడ్డి స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు గొందేశి సత్యారావు, గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, యెల్లేటి శ్రీనివాసరావు, జి.గురుమూర్తి, మంత్రి గోపీ నారాయణ, ఎం.పరదేశి, రాము తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో కనుమ వేడుకలు

వేపగుంట, జనవరి 16: ఇక్కడి నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రికొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో మంగళవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. ఇక్కడి గోశాలలో ఉన్న గోవులకు ముస్తాబు చేసి పశుగ్రాసం, పండ్లు తినిపించడంతో పాటు ఆలయ అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. తెలుగు సంప్రదాయాల్లో కనుమ పండగకు ఎంతో ప్రత్యేకత ఉందని, ఇందులో భాగంగా గోవులను, పశువులను ఆరాధించడం ఎంతో మంచిదని అర్చకులు పేర్కొన్నారు.

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో..



గోమాతకు పూజ చేస్తున్న మహిళ

అక్కిరెడ్డిపాలెం: కనుమ పండగను పురస్కరించుకుని షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు దివ్యక్షేత్రంలో ఉన్న గోవులకు పసుపు కుంకుమలు రాసి పూజలు చేశాక పలు ఆహార ప్రదార్థాలను ప్రసాదాలను తినిపించారు. అలాగే బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వరవినాయక స్వామి దేవస్థానంలో అర్చకులు లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు వెంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడీ, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 17, క్యారెట్ 32, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబాటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 32 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	564
విజయనగరం	568
శ్రీకాకుళం	568

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



జనసంచారం లేక ఖాళీగా ఉన్న గోపాలపట్నం మెయిన్ రోడ్డు



వెలవెలబోతున్న గాజువాక సినిమా హాళ్ల రోడ్డు



బోసిపోయిన షీలానగర్ జంక్షన్ రహదారి

బోసిపోయిన రహదారులు

సంక్రాంతికి సొంతూళ్లకు తరలిన ప్రజలు » దుకాణాలు మూసివేతతో కర్ఫ్యూ వాతావరణం

గోపాలపట్నం, జనవరి 16: సంక్రాంతి పండగ నేపథ్యంలో పలు ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. అత్యధిక శాతం మంది ప్రజలు తమ సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు తరలివెళ్లడంతో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నిత్యం జనంతో రద్దీగా కనిపించే ప్రముఖ కూడళ్లనీ బోసిపోయాయి. పండగ పది రోజుల నుంచి జనాలతో స్తంభించిపోయిన రహదారులన్నీ ఇప్పుడు జనకళ లేక వెలవెలబోతున్నాయి. గోపాలపట్నంలోని బడా షాపింగ్ మాల్‌లు తప్ప ఇతర దుకాణాలు దాదాపుగా మూతపడ్డాయి. ప్రధాన రోడ్డులో వ్యాపార సముదాయాలు మూతపడడం, అధిక శాతం జనాలు ఊళ్లకు తరలివెళ్లడంతో ప్రధాన రహదారిలో వాహన రాకపోకలు తగ్గుముఖం పట్టాయి. వాహనాల రాకపోకలు లేక నిత్యం రద్దీగా ఉండే బంక్ కూడలి కర్ఫ్యూను తలపించింది. అలాగే భోగి పండగ నాడు వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడిన సింహాచలం రైల్వే స్టేషన్ సంక్రాంతి రోజున జనాలు లేక వెలవెలబోయింది. స్టేషన్ ప్రాంగణం, స్టేషన్ ప్లాట్‌ఫారాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇటు రైతుబజారు కూడా కొనుగోలుదారులు లేక నిర్మానుష్యంగా కనిపించింది.

మూతపడిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు

గోపాలపట్నం ప్రధాన రోడ్డులో నిత్యం రూ.వేలల్లో వ్యాపారం చేసే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు పెద్ద పండగ సందర్భంగా మూతపడ్డాయి. ప్రధానంగా గోదావరి జిల్లాల నుంచి వచ్చి పకోడీ, బజ్జీలు వ్యాపారం చేసే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వ్యాపారులు స్వగ్రామాలకు వెళ్లడంతో దాదాపుగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లన్నీ మూతపడ్డాయి. ఇక ఫుట్‌పాత్‌పై టిఫిన్ దుకాణాలు నిర్వహించే వర్తకులు కూడా స్వగ్రామాలకు వెళ్లడంతో ఆహార పదార్థాలు విక్రయించే షాపులు లేక పలువురు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఉన్న ఒకటి రెడు టిఫిన్ దుకాణాల వద్ద పదుల సంఖ్యలో జనాలు బారులుతీరారు.



బోసిపోయిన ఎస్ఎస్‌టీఎల్ డబుల్ రోడ్డు



నిర్మానుష్యంగా ఉన్న అగనంపూడి కూడలి



పెందుర్తి రోడ్డులో కొద్దిమందే రాకపోకలు సాగిస్తున్న దృశ్యం



పండగ వేళ.. ఖాళీగా ఉన్న గోపాలపట్నం బంక్ కూడలి



జన సందడి లేని పాత గాజువాక జంక్షన్

ఏ రోడ్డు చూసినా కర్ఫ్యూ వాతావరణమే..

గాజువాక: పండగ నేపథ్యంలో గాజువాక పారిశ్రామిక ప్రాంతం బోసిపోయింది. ఏ రోడ్డు చూసినా కర్ఫ్యూ వాతావరణమే కనిపించింది. గాజువాక పరిసరాల్లోని ప్రజల్లో అధిక శాతం మంది తమ స్వగ్రామాలకు వెళ్లడంతో రెండు రోజుల నుంచి జన సంచారం లేకుండా రోడ్లన్నీ ఖాళీగానే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పాత గాజువాక ప్రధాన రహదారి, కొత్త గాజువాక, సినిమా హాల్ జంక్షన్, మార్కెట్.. ఇలా ప్రధాన కూడళ్లన్నీ నిత్యం జన సంచారంతో ఉండేవి. అయితే సంక్రాంతి, కనుమ రోజైన మంగళవారం మాత్రం రోడ్లన్నీ వెలవెలబోయాయి. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ సైతం ఖాళీగా కనిపించాయి. ఆర్టీసీ బస్సులు అంతంతమాత్రంగానే తిరిగాయి. ఆటోలు కూడా అంతగా తిరగలేదు. ముఖ్యంగా మూడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లను మూసివేయడంతో బ్యాచిలర్స్ కాస్త ఇబ్బందులకు గురయ్యారు.

వెలవెలబోయిన రహదారులు

అక్కిరెడ్డిపాలెం: పెద్ద పండగ సంక్రాంతి, కనుమ సందర్భంగా ఎక్కువ శాతం మంది ప్రజలు స్వగ్రామాలకు తరలివెళ్లడంతో మెయిన్ రోడ్లన్నీ వెలవెలబోయాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే హైవేలోని షీలానగర్, బీహెచ్‌పీవీ, తదితర కూడళ్లు ఖాళీగా కనిపించాయి. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం జంక్షన్లలోని దుకాణాలను మూసివేయడంతో ఆయా ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి.

అగనంపూడి పరిసర ప్రాంతాలు..

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్, ఫార్మాసిటీ, ఇండస్ట్రియల్ ఏరియాలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు కుటుంబ సమేతంగా సొంత గ్రామాలకు వెళ్లడంతో ప్రధాన కూడళ్లతో పాటు వీధి రోడ్లు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి. ముఖ్యంగా అగనంపూడి ప్రధాన కూడలితో పాటు శనివాడ వేపచెట్టు జంక్షన్, మినీ జగదాంబ కూడలి జనం లేకపోవడంతో బోసిపోయాయి. దుకాణాలన్నీ మూతపడ్డాయి.

పెందుర్తిలో..

పెందుర్తి: భారీ వాహనలు, జన సామర్థ్యంతో నిత్యం రద్దీగా ఉండే పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపించాయి. అక్కడ అక్కడ వాహనాలతో రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. పెందుర్తిలో ఉపాధి కోసం వలస వచ్చిన కూలీలు అధికంగా ఉండడం. వారంతా పండక్కి ఊరెళ్లడంతో ఆయా ప్రాంతాల్లో జనకళ తప్పింది.

ఎన్ఏడీ కూడలిలో..

ఎన్.ఎ.డి. జంక్షన్: సంక్రాంతి పండక్కి అత్యధికులు స్వగ్రామాలకు తరలివెళ్లడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఎన్ఏడీ ఫ్లైఓవర్, ఎన్ఎస్‌టీఎల్ డబుల్ రోడ్డు, కరాస రహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి. రోడ్లకు ఉన్న అనేక వాణిజ్య సముదాయలను కూడా మూసివేయడంతో కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది.

వేపగుంటలో..

వేపగంట: రోజూ జన సంచారంతో సందడిగా ఉండే వేపగుంట నాలుగు రోడ్ల కూడలి నిర్మానుష్యంగా దర్శనమిచ్చింది. ముఖ్యంగా సింహాచలం వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిలోని మూడు రోడ్లు కూడా ఖాళీగా కనిపించాయి.



కర్ఫ్యూను తలపించేలా వేపగుంట నాలుగురోడ్ల కూడలి

పండగ పూట పస్తులా..

గరిటెలతో కంచాలను కొడుతూ నిరసన తెలిపిన అంగన్‌వాడీలు

పెందుర్తి, జనవరి 16: వేతనాలు అందక పండగ పూట పస్తులు ఉంటున్నామని.. వైసీపీ ప్రభుత్వం ఉసురు పోసుకుంటుందని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ సమ్మతమైన తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. సంక్రాంతి, కనుమ పండగలను పురస్కరించుకుని సోమ, మంగళవారాల్లో శిబిరం వద్ద రంగవల్లికలు వేశారు. ఈ సందర్భంగా పండగ పూట పస్తులుంటున్నామంటూ కంచాలను గరిటెలతో కొడుతూ అమ్మా ఆకలి అంటూ నిరసన వ్యక్తం చేశారు.



కంచాలను గరిటెలతో కొడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వైసీపీ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలను అవలంభిస్తోందని వంటికాలిపై నిలబడి రెండు చేతులతో దణ్ణం పెడుతూ ఆందోళన చేశారు. అంతకుముందు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మండలాలకు చెందిన పలువురు అంగన్‌వాడీలు, ఆయాలు పెద్దసంఖ్యలో దీక్షా శిబిరం వద్ద సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ ప్రతినిధులు ఆర్.అనిత, బృంద, అంగన్‌వాడీ మండల శాఖ ప్రతినిధులు దేవి, లక్ష్మి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరిపల్లి శివాలయ పరస

పెందుర్తి, జనవరి 16: మండలంలోని సరిపల్లిలో మంగళవారం శివాలయ తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు శివాలయాన్ని సందర్శించి స్వయంభు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

చింతల అగ్రహారంలో..

పెందుర్తి-రూరల్: మండలంలోని చింతల అగ్రహారంలో సీతారాముల పరసను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు రామాలయాన్ని శోభాయమానంగా అలంకరించగా, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో సీతారాములను దర్శించుకుని పూజలు జరిపారు. భక్తులకు పానకం పంపిణీ చేశారు. పరస సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లు అందరినీ ఆకట్టుకున్నాయి. కాగా బుధవారం రాంపురం, పాత పెందుర్తి, వేపగుంట గ్రామాల్లో పరసలు నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నెల్లిముక్కులో..

పెదగంట్యాడ: నెల్లిముక్కు రామాలయం వద్ద సీతారాముల పరసను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, జి.సత్యారావు, డి.సింహాచలం, ఎం.రమణ, శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మిందిలో..

అక్కిరెడ్డిపాలెం: ఏటా పారిశ్రామిక ప్రాంతంలో మొట్టమొదటిగా జరిగే మింది సీతారాముల తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి, కనుమల్లో రెండు రోజుల పాటు జరిగిన సీతారాముల తీర్థాన్ని పురస్కరించుకుని సీతారాములను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రంగుల రాట్నం ఎక్కి చిన్నారులు కేరింతలు కొట్టారు. తప్పెటగుళ్లు, కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

దానబోయినపాలెంలో..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి దానబోయినపాలెం రామాలయం వద్ద సోమవారం సీతారాముల పరసను నిర్వహించారు. ఉదయం నుంచే



దానబోయినపాలెం పరసలో భజనలు చేస్తున్న భక్తులు



సరిపల్లిలో రంగులరాట్నం ఎక్కిన చిన్నారులు

భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో పరసను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెటగుళ్లు, సాము గారిడీలు, బొమ్మలకొలువు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే ఇక్కడి జగన్నాథస్వామి ఆలయ వద్ద పరస ఉత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సమర, గురుమోహన్, గురు త్రినాథ్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశ్‌నగర్‌లో..

మల్కాపురం: ఇక్కడి ప్రకాశ్‌నగర్‌లోని ఏడు గుళ్ల జంక్షన్‌లో ఏడు అమ్మవార్ల పరసను పీఎంసీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పి.గణబాబు పరస కార్యక్రమంలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల ప్రజలు వేకువజాము నుంచే అమ్మవార్లను దర్శించేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

వైభవంగా అయ్యప్ప స్వామి మకరజ్యోతి దర్శనం



ఆలయంలో పూజలందుకున్న అయ్యప్ప స్వామి



పొన్నంబల కొండ పైనుంచి మకరజ్యోతి దర్శనం..

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 16: స్టీల్‌ప్లాంట్ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మకర జ్యోతి దర్శనం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయం వెనక గల పొన్నంబల కొండపై 6.49 నిమిషాలకు భక్తులకు మకరజ్యోతి దర్శన భాగ్యాన్ని కల్పించారు. కేరళలోని శబరిమల సన్నిధానంలో జరిగే మాదిరిగానే ఇక్కడి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. గత కొన్నేళ్లగా ఈ ఆలయంలో మకరజ్యోతి దర్శనం కల్పిస్తుండడంతో స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేత

అక్కిరెడ్డిపాలెం, జనవరి 16: క్రీడల్లో యువత ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయిలో విశాఖకు తగిన గుర్తింపును తీసుకురావాలని రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా మిందిలో గుడివాడ యువసేన ఆధ్వర్యంలో గుడివాడ గురునాథరావు స్మారక క్రికెట్ పోటీలను నిర్వహించి, విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో కింగ్స్ మెన్స్ లెవన్ జట్టు విజేతగా నిలవగా, వన్నీ గైస్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గుడివాడ అప్పలరామ్మూర్తి, గుడివాడ లతీశ్, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

క్రీడలతో మానసిక ఉత్తేజం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



పోటీలను ప్రారంభించిన అనంతరం సరదాగా క్రికెట్ ఆడుతున్న 'పల్లా'

పెదగంట్యాడ, జనవరి 16: క్రీడల్లో పాల్గొనడం వల్ల యువతలో నూతన ఉత్తేజం వస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో మంగళవారం నెల్లిముక్కు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి, కాసేపు సరదాగా ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా యువత కోసం క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, గందం శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు ఎం.పెంటయ్య, జి.వాసు, ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో వైభవంగా గిరి ప్రదక్షిణ



కోలాటం నడుమ ప్రారంభమైన గిరి ప్రదక్షిణ

పద్మనాభం, జనవరి 16: పద్మనాభం అనంతపద్మనాభుని గిరి ప్రదక్షిణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా కనుమ రోజు సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవంలో భాగంగా కుంతీమాధవస్వామి ఆలయంలో ఉభయ దేవేరులతో కూడిన అనంతుడిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఉంచారు. అనంతుని గిరి చుట్టూ ఊరేగించారు. మార్గ మధ్యలో ఇసకలపాలెం గ్రామం వద్ద స్వామివారి పూలతోటలో ఉన్న వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిప్రదక్షిణ నిర్వహించే ఇసకలపాలెం, అర్చకునిపాలెం, పద్మనాభం గ్రామాలలోని భక్తులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళల కోలాటంతో గిరిప్రదక్షిణ ఉత్సవం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, సర్పంచ్ పాప, పద్దు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు పైడిరాజు, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా కనుమ పండగ సందర్భంగా మంగళవారం అనంతుని పరస ఘనంగా జరిగింది.

సీబీఎన్ మిత్ర ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

అగనంపూడి, జనవరి 16: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకుని గాజువాక సీబీఎన్ మిత్ర మండలి ఆధ్వర్యంలో సోమవారం అగనంపూడిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సీబీఎన్ మిత్ర మండలి ప్రతినిధి టి.హర్షవర్ధన్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచం నలుమూలలా చాటిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. మిత్ర మండలి ప్రతినిధులు ఎం.నరసింగరావు, శ్రీనివాసరావు, బి.అప్పలరాజు, ఎం.నాయుడు, పాండురంగ జయరాజు, ఎన్.దేముడు, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మాంసం దుకాణాలు



మటన్ దుకాణం వద్ద బారులుతీరిన కొనుగోలుదారులు

గోపాలపట్నం, జనవరి 16: కనుమ పండగ సందర్భంగా మంగళవారం కొనుగోలుదారులతో మాంసం దుకాణాలు కిటకిటలాడాయి. భోగి పండగ దృష్ట్యా ఆదివారం మాంసం విక్రయాలు అంతగా జరగలేదు. దీంతో కనుమ నాడు చికెన్, మటన్ విక్రయాలు జోరుగా సాగాయి. స్థానిక బంక్ కూడలిలోని మాంసం దుకాణాలన్నీ వేకువజాము నుంచే కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి. సాధారణ రోజులతో పోలిస్తే రెండింత ఎక్కువగా మంగళవారం అమ్మకాలు జరిగినట్టు వ్యాపారులు తెలిపారు. అదేవిధంగా చేపల అమ్మకాలు కూడా ఆశాజనకంగానే సాగాయి.

పోలమాంబ ఉత్సవాలకు చాటింపు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

జగదాంబ కూడలి, జనవరి 16: గ్రేటర్ 30వ వార్డు కుమ్మరవీధిలో పోలమాంబ అమ్మవారి 66వ వార్షిక మహోత్సవాలకు సంబంధించి మంగళవారం చాటింపు వేశారు. సంప్రదాయం ప్రకారం కుమ్మరవీధి, సాలిపేట, తాడివీధి, జెండాచెట్టు, ఏనుగుల వీధి ప్రాంతాల్లో డప్పు చాటింపుతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 21న తొలేళ్ల సంబరాలు, 23న మహోత్సవం (పరస) ను నిర్వహిస్తున్నట్టు గ్రామపెద్దలు వివరించారు. అదేవిధంగా 19వతేదీన ఉత్సవరాట మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నట్టు చెప్పారు. కనుమ పండుగ పురస్కరించుకుని అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుద్ధుని విగ్రహావిష్కరణ



మురళీనగర్ పార్కులో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మురళీనగర్, జనవరి 16 ; గ్రేటరు 50వవార్డు మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని మంగళవారం పార్కు కమిటీ అధ్యక్షులు సనపల.వరప్రసాద్ అధ్వర్యంలో పార్కు వ్యవస్థాపక సభ్యులైన ఎస్.బుచ్చయ్య చౌదరి ఆవిష్కరించారు. అన్ని వసతులతో పెద్దలకు, పిల్లలకు చేరువైన పార్కులో బుద్ధుని విగ్రహం ఏర్పాటు మరింత శోభ చేకూరుస్తుందని ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. కాలనీ వాసులు, క్లబ్ సభ్యులు కార్యక్రమంలో ఉన్నారు.

పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల నియామకంపై హర్షం

మహారాణిపేట, జనవరి 16: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా అధిష్ఠానం వైఎస్ షర్మిలని నియమించడంపై ఆ పార్టీ నగర జిల్లా అధ్యక్షులు గొంప గోవింద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు.దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ప్రస్తుతం చాలా అవసరమన్నారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున కార్గే నాయకత్వంలో కేంద్రంలో, వైఎస్ షర్మిల, గిడుగు రుద్రరాజు, పార్టీ సీనియర్ నాయకులసారథ్యంలో రాష్ట్రంలో ఎన్నికలకు వెళ్లి విజయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంతోనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా,విభజనహామీలతోపాటుఅభివృద్ధి, సంక్షేమం అమలవుతాయన్నారు.


గెడ్డలో పేరుకుపోయిన చెత్త


నరేంద్రనగర్‌లో ఇళ్ల ఎదుట నిలిచిన మురుగునీరు

గెడ్డలో పూడికలతో అవస్థలు

- తొలగింపులో జీవీఎంసీ నిర్లక్ష్యం
- యంత్రాంగంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ ఆగ్రహం

అక్కయ్యపాలెం, జనవరి 16 : గ్రేటర్ 43వ వార్డు నరేంద్రనగర్, నందగిరినగర్ మధ్యలో ఉన్న గెడ్డలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ జీవీఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక నాయకులతో కలసి ఆయన గెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత 15 ఏళ్ల క్రితం బాణ సంచా తయారు చేసే సమయంలో ప్రమాదం జరిగిందని, అప్పట్లో ఈ గెడ్డలో ఉన్న చెత్తను తొలగించారన్నారు. అప్పటినుంచి పూడికలు తొలగించకపోవడంతో గెడ్డలో మురుగునీరు రోడ్డుపైకి, ఇళ్లలోకి వచ్చేస్తుందన్నారు. దీని వల్ల దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. ఇంతగా ఇబ్బంది ఎదుర్కొంటున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యాధులు ప్రబలుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్త తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్య క్షుడు మొల్లేటి కుమారస్వామి, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకా సత్యకిరణ్, స్థానికులు మహేష్, పి.రామకృష్ణ, టి.శ్రీనివాస్, జె.సత్యనారాయణ ఉన్నారు.


గెడ్డను పరిశీలిస్తున్న టీడీపీ నేత లొడగల కృష్ణ

రహదారులు ఘోరం... వాహనదారులకు నరకం

- అడుగడుగునా గోతులు
- వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు
- డాబాగార్డెన్స్ పరిధిలో దుస్థితి


డాబాగార్డెన్స్ నుంచి పెన్ స్కూల్ వైపుగా వెళ్లే మార్గంలో గోతులు

డాబాగార్డెన్స్, జనవరి 16: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ పలు ప్రాంతాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డాబాగార్డెన్స్ శారదాస్ట్రీట్, సరస్వతీ పార్కు సర్కిల్ ప్రధానరహదారులు దెబ్బతిన్నాయి. అడుగుకో పెద్ద గొయ్యి పడడడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు డాబాగార్డెన్స్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ సరస్వతీ పార్కు నుంచి జగదాంబ తదిర ప్రాంతాలు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో రహదారులు ఘోరంగా మారడంతోపాటు వాహనదారులు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆయాప్రాంతాల్లో కి ఏమరుపాటు వచ్చేవారు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. చాలామంది వాహనదారులు గోతుల్లో పడి వెన్నునొప్పు బాధతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.లేకుంటే రహదారులతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని వాపోతున్నారు.


రహదారిపై పెద్దగొయ్యి..


సరస్వతీ పార్కు సర్కిల్‌లో ..

పద్య నాటకాల్లో అప్పలసూరిది ప్రత్యేకముద్ర


అప్పలసూరి జన్మదినోత్సవంలో ప్రతినిధులు

అక్కయ్యపాలెం, జనవరి 16: పద్యనాటక నటుడు, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు పొన్నాన అప్పల సూరి నేటితరం నటులకు ఆదర్శమూర్తి అని చైతన్య సమితి అధ్యక్షుడు బీవీ అప్పారావు కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎరగాం గ్రామానికి చెందిన డాక్టర్ పొన్నాన అప్పలసూరి 90వ జన్మదిన వేడుకలు నగరంలోని ఇసుకతోటలోని ఆయన కుమారుడు స్వగృహంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పౌరాణిక నాటకాల్లో అప్పలసూరి ప్రత్యేక ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ నాన్ టీచింగ్ స్టాఫ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కమ్మేసిన కాలుష్యం

... 5వ పేజీ తరువాయి

తీసుకుని గాలిలో నాణ్యత శాతాన్ని నిర్ధారిస్తారు. ఈ నెలలో ఒకటో తేదీ నుంచి మంగళవారం వరకు నగరంలో గాలిలో నాణ్యత శాతాన్ని నిర్ధారించే సూచీ (ఇండెక్స్) పరిశీలిస్తే 5, 6, 7, 16 తేదీల్లో తప్ప మిగిలిన 12 రోజుల్లో తొమ్మిది రోజులు 'పూర్' (నాసిరకం), 3, 11, 14 తేదీల్లో వెరీపూర్ (అత్యంత నాసిరకం)గా నమోదైంది. వెరీ పూర్‌గా నమోదైన మూడో తేదీన ఇండెక్స్ 316, 11వ తేదీన 302, 14వ తేదీన 315గా నమోదుకావడం ఆందోళన కలిగిస్తోంది. భోగి పండుగ సందర్భంగా వీధుల్లో వేసిన మంటల నుంచి వచ్చిన పొగ నగరాన్ని కమ్మేసింది. దీంతో గాలిలో నాణ్యత ప్రమాణాలు పడిపోవడంతో 14వ తేదీన సూచీ 315గా నమోదైంది. కాలుష్య నియంత్రణ మండలి సూచీ ప్రకారం 200 నుంచి 300 వరకు నమోదైతే గాలి పీల్చుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. అదే సూచీ 301 నుంచి 400 వరకు నమోదైతే శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతాయి.

పీఎం 2.5 అత్యంత ప్రమాదకరం

గాలిలో ధూళి కణాలను రెండు రకాలుగా నమోదుచేస్తారు. ఒకటి పీఎం 2.5. ఇవి అతి సూక్ష్మమైనవి. ప్రమాదకరమైనవి. అతి సూక్ష్మమైన ఈ ధూళి కణాలు శ్వాస పీల్చుకున్నప్పుడు లోనికి వెళ్లి ఊపిరితిత్తులలో ఉండిపోతాయి. ఇక రెండోది పీఎం 10. గాలి పీల్చినప్పుడు పీఎం 10ను ముక్కు నిలువరిస్తోంది. అయితే ఇది కూడా పరిమితికి మించితే ప్రమాదమే.

బంగ్లాదేశ్ నౌకకు మోక్షమెన్నడో?

... 5వ పేజీ తరువాయి

విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు.

సీఆర్‌జెడ్ బోర్డు సమావేశంలో కొర్రీలు

నౌక నిలిచిపోయిన ప్రాంతం కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) పరిధిలో ఉంది. అక్కడ ఎటువంటి కార్యక్రమం చేపట్టాలన్నా వారి అనుమతి కూడా అవసరం. ఈ ఫైల్‌ను కూడా అక్కడకు పంపించారు. ఇటీవల జరిగిన సీఆర్‌జెడ్ బోర్డు సమావేశంలో ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని మరిన్ని వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. తరువాత జరిగే బోర్డు సమావేశంలో వాటిపై చర్చించాక అనుమతిపై నిర్ణయం తీసుకుంటారు.

ప్రజలకు మంచి అనుభూతి ఇవ్వాలనే...

- శ్రీనివాస పాని, రీజనల్ డైరెక్టర్, పర్యాటక శాఖ

ఎందుకూ ఉపయోగపడని నౌకను పర్యాటకంగా ఉపయోగించుకుంటే మరో కురుసుర సబ్‌మెరైన్‌లా అందరికీ చక్కటి అనుభూతిని ఇస్తుందని ప్రభుత్వం తరఫున యత్నిస్తున్నాము. అనుమతులు చివరి దశలో ఉన్నాయి. రాగానే మ్యూజియంగా, రెస్టారెంట్‌గా తీర్చిదిద్దుతాము. ఇవన్నీ ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పనులు కావడం వల్ల బయట అన్నీ తయారుచేసి ఇక్కడికి తెచ్చి నౌకలో ఏర్పాటుచేస్తారు.

ఘనంగా భజనచెట్టు ఉత్సవం


భజన చెట్టువద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

జ్ఞానాపురం, జనవరి 16 : రామలీలపరసమహోత్సవం సందర్భంగా శ్రీగ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో భజనచెట్టు ఉత్సవం మంగళవారం ఘనంగా జరిపారు. రామాలయంలో భజనచెట్టుకు పూజలు నిర్వహించి తిరువీధి ఉత్సవం జరిపారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, పాల్గొని పూజలు చేశారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు దాడి సూర్య అప్పారావు, మళ్ల శంకరరావు, రామ భజన సమాజం అధ్యక్షుడు కాళ్ల సూరిబాబు, మళ్ల శివాజీ భజనచెట్టుకు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

తీర్థాలతో సందడే... సందడి

జ్ఞానాపురం, జనవరి 16: సంక్రాంతి నుంచి తీర్థాలు (పరసలు) ప్రారంభం కానున్నాయి. గ్రామీణప్రాంతాల్లో జరిగే తీర్థాల మాదిరిగా నగరంలో పలు ప్రాంతాల్లో శ్రీరామలీలా పరసమహోత్సవాలను ఏటా నిర్వహిస్తుంటారు. నగరంలో అల్లిపురం, వెంకటేశ్వరమెట్ట ప్రాంతాలతోపాటు గవరకంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, మర్రిపాలెం, కరసా, బుచ్చిరాజుపాలెం, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో ఈ పరస ఉత్సవాలు రోజూఏదో చోట కనిపిస్తుంటాయి. ఈ ఉత్సవాల్లో సాముగారడీలు, తప్పటగుళ్లు, పులివేషాలు, కోలాటాలు తదితర కళాప్రదర్శనలు పిల్లలు, పెద్దలను ఆనందాన్ని పంచుతాయి. కనుమ రోజు ప్రారంభమయ్యే ఈ పరసలు మూడునాలుగు నెలల పాటు పలుచోట్ల కొనసాగుతాయి. ఈ జాతర్లలో పిల్లలు ఆడుకునే రకరకాల బొమ్మలను విక్రయిస్తుంటారు. వాటితోపాటు వారు వివిధ తినుబండారాలు ఉంటాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తాయి. చిన్నారులను ఆకాశంలో విహరింపజేయడానికి రంగులరాట్నం.. పంచదార చిలకలు ..ఖర్జూరం... చెరకుగడలు...రంగురంగుల బెలూన్ల విక్రయాలు జోరుగా సాగుతాయి.

కనకమహాలక్ష్మి ఆలయంలో 'కనుమ '

- గోవులకు భక్తి శ్రద్ధలతో పూజలు

జగదాంబ కూడలి, జనవరి 16: వన్‌టౌన్ బూరుజుపేటలో కనకమహాలక్ష్మి ఆలయంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం కనుమ పురస్కరించుకుని సాంప్రదాయబద్ధంగా గోవులకు ఈవో కె.శిరీష, అధికారులు, సిబ్బంది పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతలను ప్రత్యేకంగా అలంకరించారు.


గోమాతకు పూజలు చేస్తున్న దేవస్థానం అధికారులు


అమ్మవారికి పద్మారాధన సేవ

ఈ వేడుకల్లో నగరంలోని వివి.ధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి అష్టదశ పద్మారాధన సేవలు

కనకమహాలక్ష్మికి అమ్మవారికి మంగళవారం అ ష్టదశ పద్మారాధన సేవల్లోభాగంగా 108 స్వర్ణపుష్పాలతో అలంకరిం చి పూజలను జరిపారు. తెల్లవారుజామున నిర్వహించిన పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు.

కొత్త అల్లుడికి 300 రకాలకుపైగా వంటకాలతో సంక్రాంతి ఆతిథ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 16: తెలుగు వారికి పెద్ద పండుగ సంక్రాంతి. కొత్త అల్లుళ్లకు అత్తింటివారు తమ స్థోమతకు తగ్గట్టుగా మర్యాదలు చేస్తుంటారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లి దుర్గా లాడ్జి వీధికి చెందిన గుండా సాయిగోపాల్, మాధవి దంపతులు సంక్రాంతిని పురస్కరించుకుని తమ అల్లుడికి 300 రకాలకుపైగా వంటకాలతో ఆతిథ్యం ఇచ్చారు.

వందలాది రకాల స్వీట్లు, తినుబండారాలు, 15 రకాల కూరలు అరటి ఆకుపై వడ్డించారు. సాయిగోపాల్ దంపతుల కుమార్తె రిషితకు డిసెం బరులో విశాఖకు చెందిన దేవేంద్రనాథ్‌తో వివాహమైంది. పెళ్లయిన తరువాత వచ్చిన మొదటి పెద్ద పండుగ కావడంతో పాటు ఇప్పటి వరకు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఇటువంటి సంప్రదాయాన్ని అనకాపల్లికి కూడా విస్తరింపజేయాలని ఉద్దేశంతో ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు సాయిగోపాల్ తెలిపారు.


నూతన దంపతులకు వడ్డించిన పదార్థాలు

పండగపూట విషాదం

... 5వ పేజీ తరువాయి

దత్తిరాజేరు మండలం కోమటిపల్లి కూడలి వద్దకు వచ్చేసరికి ముందున్న లారీని ఓవర్‌టేక్ చేసే యత్నంలో విశాఖ నుంచి పార్వతీపురం వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసకుమారి, మహేష్ సంఘటనా స్థలంలో చనిపోగా, సత్యనారాయణ ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయినట్టు దత్తిరాజేరు ఇన్‌చార్జి ఎస్‌ఐ మహేశ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.

టెస్ట్ మ్యాచ్ టికెట్లపై అయోమయం

... 5వ పేజీ తరువాయి

ఆన్‌లైన్‌లో కేవలం ఐదు రోజుల సీజన్ టికెట్లు (రూ.400, రూ.800, రూ.1000) మాత్రమే ఉన్నాయి. నిర్వాహకులు ప్రకటించిన రూ.1500 టికెట్లు కనిపించడం లేదు. కనీసం అమ్ముడైపోయినట్టు (సోల్డ్ అవుట్) కూడా చూపడం లేదు. ఇక రూ.100, 200, రూ.300, రూ.500 ధర గల రోజువారీ టికెట్ల విక్రయాలపై అయోమయ పరిస్థితి నెలకొంది. పేటీఎం ఇన్‌సైడర్‌లో రోజువారీ టికెట్లు అమ్ముడైయినట్టు చూపకపోవడంతో క్రీడాభిమానులలో అనుమానాలు నెలకొన్నాయి. ఐదు రోజుల సీజన్ టికెట్లకు సంబంధించి మంగళవారం రాత్రి సమయానికి ఎం, ఎం-1 స్టాండ్‌లో రూ.400, 'ఎఫ్' స్టాండ్‌లో రూ.800 టికెట్లు, అలాగే సౌత్ వెస్ట్ అప్పర్ స్టాండ్, సౌత్ ఈస్ట్ అప్పర్ స్టాండ్‌తోపాటు జీ, వో, ఐ స్టాండ్స్‌లో రూ.1000 టికెట్లు అందుబాటులో ఉన్నట్టు పేటీఎం ఇన్‌సైడర్‌లో చూపుతున్నాయి. రూ.1500 ధర గల సీజన్ టికెట్లు, అలాగే రూ.100, 200, రూ.300, రూ.500 ధర గల రోజువారీ టికెట్లకు సంబంధించి ఇన్‌సైడర్‌లో ఎటువంటి సమాచారం కనిపించడం లేదు.

మునగపాకలో ఎడ్లబండి పోటీలకు విశేష స్పందన


ఎడ్ల పరుగు పోటీల దృశ్యం

మునగపాక, జనవరి 16 : సంక్రాంతిని పురస్కరించుకుని మునగపాక బైపాస్ రోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఎడ్లబండి పోటీలకు విశేష స్పందన కనిపించింది. ఈ పోటీలను చూడడానికి వేలాదిమంది రావడంతో బైపాస్ ప్రాంతమంతా కిక్కిరిసింది. పోటీలను మాజీమంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. అలాగే ఈ కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కూండ్రపు అప్పారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ప్రథమ బహుమతి సంపత్ వినాయక (నర్సాపురం), ద్వితీయ బహుమతి అద్దేపల్లి పాలవెల్లి (చుక్కపల్లి), తృతీయ బహుమతి గండి వెంకటరావు (వాయిలపాడు), నాలుగో బహుమతి అభయ ఆంజనేయస్వామి (సింహాద్రిపురం), ఐదో బహుమతి మరిడిమాంబ (బుచ్చియ్యపేట)లకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు.


బాల్వాడీ భవనం గోడపై మొలచిన చెట్టు


శిథిల భవనంలో చిన్నారులు

భయం నీడన చిన్నారులు

- సింహగిరి కాలనీలో శిథిలావస్థలో బాల్వాడీ భవనం
- బీటలు వారిన భవనాలతో పొంచి ఉన్న ప్రమాదం

అక్కయ్యపాలెం, జనవరి 16: గ్రేటర్ 45వ వార్డు సాలిగ్రామపురం సమీపం కొండవాలు ప్రాంతమైన సింహగిరి కాలనీలోని శిథిలావస్థకుచేరిన బాల్వాడీ భవనంలో చిన్నారులకు బోధన కొనసాగుతోంది. దీంతో చిన్నారులకు ఏ క్షణంలో ప్రమాదం సంభవిస్తోందని తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ కాలనీ 1982 సంవత్సరంలో ఆవిర్భవించింది. 1985లో స్థానికుల పిల్లల చదువుకునేందుకు వీలుగా అప్పటి మున్సిపల్ కార్పొరేటర్ చొరవతో ఈ బాల్వాడీ భవనాన్ని నిర్మించారు. మూడు దశాబ్దాలు గడవడంతో భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీనికి మరమ్మతులు లేదా పునఃనిర్మాణానికి చేపట్టేందుకు చర్యలు చేపట్టలేదు.

ఈ కేం ద్రంలో సుమారుగా 25 మంది చిన్నారులు చదువుతున్నారు. శిథిలావస్థలోని ఈ భవనం కూలిపోయి చిన్నారులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వర్షాలు, ఈదురు గాలులు వస్తే భవనంలో ఉన్న చిన్నారుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆ భవనానికి ఉన్న గోడకు ఆనుకుని ఓ చెట్టు మొలిచింది. దాన్ని తొలగిస్తే భవనం కూలిపోయే ప్రమాదం ఉందంటున్నారు. భవనం లోపల, బయట గోడలు పగిలిపోయాయి. ఈనేపథ్యంలో ఆ భవనాన్ని కూలగొట్టి నూతన భవనాన్ని నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైల్వే ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

విశాఖపట్నం, జనవరి 16: సంక్రాంతి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల భద్రత, సౌకర్యాల నిర్వహణపై డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన స్టేషన్లలో అదనపు ఆర్పీఎఫ్ సిబ్బందిని నియమించారు. రద్దీని నియంత్రించేందుకు ప్రయాణికులు రైలెక్కే సమయంలో రిజర్వేషన్, సాధారణ కోచ్‌ల వద్ద ప్లాట్‌ఫామ్‌పై క్యూ పాటించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైళ్ల రాకపోకలపై ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారమందించాలన్నారు. ప్రయాణికుల సహాయ చర్యలు చేపట్టేందుకు ప్రధాన స్టేషన్లలో వైద్య బృందాలను ఏర్పాటు చేయడంతోపాటు ఆర్పీఎఫ్, టీటీఈ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాల్స్, రిటైరింగ్ రూమ్స్ వద్ద ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. సంక్రాంతి ప్రయాణికుల రాకపోకల సౌకర్యార్థం వివిధ ప్రాంతాలకు 45 ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టి దాదాపు వంద ట్రిప్పులతో రాకపోకలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

- రూ.95,550 స్వాధీనం

సీతంపేట, జనవరి 16: నాలుగోపట్టణ పోలీసు స్టేషన్ పరిధి సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని ఓ అపార్టుమెంట్‌లో టాస్క్‌ఫోర్సు పోలీసులు, నాలుగో పట్టణ పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.95,550లు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

నిత్య సేవకుడికి సత్కారం



శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

తగరపువలస, జనవరి 16: స్థానికంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వి.శ్రీనివాసరెడ్డిని వివిధ పార్టీల నాయకులు మంగళవారం సన్మానించారు. చిట్టివలస హెల్పింగ్ హేండ్ సంస్థ ఆధ్వర్యంలో తగరపువలస సాయిబాబా గుడి వద్ద వైసీపీ నేత ఎ.రామునాయుడు, టీడీపీ నాయకులు పి.సురేష్, జనసేన మహిళా నేత పి.భువనేశ్వరి ఆధ్వర్యంలో ఆయనను సన్మానించి మెమెంటోలను అందించారు.

చిల్లపేటలో చిల్ల ధర్మారెడ్డి జయంతి

తగరపువలస, జనవరి 16: చిట్టివలస కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షునిగా సేవలందించిన చిల్ల ధర్మారెడ్డి 46వ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్మిక నాయకునిగా ఎదుగుతున్న వయసులో ధర్మారెడ్డి చనిపోవడం కార్మిక లోకానికి తీరని నష్టజరిగిందని పేర్కొన్నారు. చిల్లపేటలో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జెట్టీని అందుబాటులోకి తేవాలి



అన్నవరం తీరంలో నిర్మించిన జెట్టీ

భీమునిపట్నం (రూరల్), జనవరి 16: మండలంలోని అన్నవరం సముద్రతీరంలో పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్న సముద్రంలో జెట్టీపైకి పర్యాటకుల్ని అనుమతించాలని పలువురు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో 1990లో బిర్లా పెరికిల్స్ సంస్థ సముద్ర ఇసుక నుంచి ఖనిజాలను తయారు చేసే పరిశ్రమ కోసం ఈ జెట్టీని నిర్మించింది సముద్రంలో ఫర్లాంగు దూరం వరకు 40 అడుగుల వెడల్పుగా జట్టీ ఉంటుంది. తర్వాత ఈ జెట్టీని దివీస్ యాజమాన్యం తన ఆధీనంలోకి తీసుకుంది. అప్పటి నుంచి పరిమితంగానే దీనిని చూడటానికి అనుమతులు ఇస్తున్నారు. పర్యాటకులు ఈ ప్రాంతం వరకు వచ్చినప్పటికీ దీని పైకి వెళ్లడానికి అనుమతి లేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సినిమాలను కూడా ఈ జెట్టీ వద్ద నిర్మించారు. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నందున జెట్టీపైకి వెళ్లడానికి అనుమతించాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం దీనిపైకి ఎవరూ వెళ్లకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. నిరుపయోగంగా ఉన్న జట్టీని పర్యాటకుల కోసం అందుబాటులోకి తీసుకువచ్చేలా స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

మల్కాపురం, జనవరి 16: శ్రీహరిపురం ప్రధాన కూడలిలో గాజువాక ఆర్టీసీ డిపోనకు చెందిన 400-వై నంబర్ గల బస్సు మరమ్మతులకు గురైంది. సుమారు 50 మంది ప్రయాణికులతో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎలమంచిలి వెళ్తుండగా కుదుపులకు గురై ఆగిపోయింది. దీంతో ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. అప్రత్తమైన డ్రైవర్ రోడ్డు పక్కన బస్సును నిలిపివేశారు. అనంతరం వారిని కండక్టర్ వేరే బస్సు ఎక్కించి పంపించారు. గాజువాక ఆర్టీసీ డిపోలో దాదాపుగా అన్ని బస్సుల పరిస్థితి ఇలాగే ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవలే శ్రీహరిపురంలో ఒకేసారి రెండు బస్సులు మరమ్మతులకు గురైన సంగతి తెలిసిందే. ఉన్నతాధికారులు స్పందించి బస్సుల కండిషన్‌పై దృష్టిసారించి నడిచేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

- **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస)
- **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, లీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శారద, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, విశేష్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 52, బీరకాయలు 54, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 17, క్యారెట్ 32, దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 110, బరబాటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 32 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 48, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	564
విజయనగరం	568
శ్రీకాకుళం	568

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	100
ఫారం ధర	--	120
విత్ స్కిన్	--	210
స్కిన్‌లెస్	--	220

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



ఎండాడ బీసీ కాలనీ సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న స్థానికులు



భీమునిపట్నం తీరంలో నిర్వహించిన పతంగుల పండగలో ప్రజలు

ఆనందోత్సాహాలతో సంక్రాంతి

ఎండాడ, జనవరి 16: జీవీఎంసీ 8,9వ వార్డు పరిధిలోని స్థానికులు, పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. అలాగే, ఎండాడలో రామాలయం నుంచి పురవీధులలో పండుగ విశిష్టతను చాటుతూ స్థానికులు దీపాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పర్యాటక ప్రాంతాలు తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం తీరం, సీతకొండ వ్యూ పాయింట్, కైలాసగిరి సందర్శకులతో కిటకిటలాడాయి. ఇళ్లలో ప్రజలు పూజలు ముగించుకుని కుటుంబసభ్యులతో పర్యాటక ప్రాంతాల వద్దకు వచ్చారు. తీరంలో యువత, చిన్నారులు పతంగులు ఎగురవేస్తూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జి పేరుతో ఫేక్ వీడియో

తెన్నేటి పార్కు దిగువన ఉన్న తీరంలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఏర్పాటు చేశారంటూ సోషల్ మీడియాలో వీడియోలు చక్కర్లు కొట్టడంతో పర్యాటకులు పార్కుకు క్యూ కడుతున్నారు. పార్కు దిగువన ఉన్న తీరంలోకి వెళ్లి అక్కడ ఫ్లోటింగ్ బ్రిడ్జిలేదని తెలుసుకుని అసంతృప్తితో వెనుదిరగడం కనిపించింది. పార్కు మెయిన్ గేట్ వద్ద కార్డుబోర్డుపై నో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఇన్ తెన్నేటి పార్కు బీచ్ అంటూ బోర్డులు ప్రదర్శించాల్సి వచ్చింది. అధిక సంఖ్యలో పర్యాటకులు రాకతో పార్కింగ్ సమస్య నెలకొంది. పార్కులో అభివృద్ధి పనులు జరుగుతుండడంతో ద్విచక్ర వాహనాలు, కార్లను రహదారి పైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బీచ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.



తెన్నేటి పార్కులో సందర్శకుల సందడి

భీమిలిలో పతంగుల పండగ

భీమునిపట్నం: సంక్రాంతి పురస్కరించుకుని సోమవారం ఉదయం భీమిలి లైట్‌హౌస్ తీరంలో పతంగుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి పాట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో ప్రజలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. చిన్నపిల్లలు, పెద్దలు, మహిళలు గాలిపటాలను ఎగురవేశారు. సాయంత్రం కూడా పలువురు పిల్లలు పతంగులతో సందడి చేశారు.

పద్మనాభంలో వైభవంగా గిరి ప్రదక్షిణ



కోలాటం నడుమ ప్రారంభమైన అనంత పద్మనాభుని గిరి ప్రదక్షిణ

పద్మనాభం, జనవరి 16: పద్మనాభం అనంతపద్మనాభుని గిరి ప్రదక్షిణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా కనుమ రోజు సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవంలో భాగంగా కుంతీమాధవస్వామి ఆలయంలో ఉభయ దేవేరులతో కూడిన అనంతుడిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఉంచారు. అనంతుని గిరి చుట్టూ ఊరేగించారు. మార్గ మధ్యలో ఇసకలపాలెం గ్రామం వద్ద స్వామివారి పూలతోటలో ఉన్న వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిప్రదక్షిణ నిర్వహించే ఇసకలపాలెం, అర్చకునిపాలెం, పద్మనాభం గ్రామాలలోని భక్తులు శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళల కోలాటంతో గిరిప్రదక్షిణ ఉత్సవం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, సర్పంచ్ పాప, పద్దు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు పైడిరాజు, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా అనంతుని పరస

కనుమ పండగ సందర్భంగా మంగళవారం అనంతుని పరస ఘనంగా జరిగింది. కుంతీమాధవస్వామి ఆలయ ప్రాంగణం వద్ద జరిగిన కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అనంతుని గిరిని అధిరోహించి, కుంతీమాధవస్వామిని దర్శించుకున్నారు.

'సకల పంటలు సమృద్ధిగా పండుతాయి'

- మకరవేటోత్సవంలో తారాజువ్వల గమనంతో రైతుల ఆనందం
- ఉత్సవానంతరం సింహాచలేశుడికి ఘనంగా తిరువీధి



మకర వేటోత్సవం సందర్భంగా తారాజువ్వలను వదిలిన దృశ్యం

సింహాచలం, జనవరి 16: రానున్న ఏడాదిలో దేశవ్యాప్తంగా సకల పంటలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కనుమ పండుగ నాటి మకర వేట సందర్భంగా విసిరే తారాజువ్వల గమనాన్ని బట్టి పంట పరిస్థితులను ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైతులు అంచనా వేస్తుంటారు. మకర వేట సందర్భంగా వేసే మూడు జువ్వలను బట్టి ముక్కారు పంటలు అనగా వరి, అపరాలు, మెట్ట (జీడి,మామిడి,పనస) పంటల దిగుబడిపై అంచనాకు వస్తారు. గజేంద్ర మోక్షోత్సవంలో తారాజువ్వల గమనాన్ని వీక్షించేందుకు వందలాది మంది రైతులు తరలివచ్చారు. ఈ ఏడాది మూడు తారాజువ్వలు పైనుంచి కిందకి, తిరిగి పైకి చేరుకోవటంతో రైతులు వరి, అపరాలు, మెట్ట పంటలకు కొదువలేదంటూ సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం రాత్రి స్వామివారు గజవాహనంపై తిరువీధికి బయలుదేరారు. మార్గం పొడవునా మంగళవాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్ఛారణలు, భక్తులు గోవింద నామస్మరణలు మిన్నంటాయి. అనంతరం సింహగిరికి తిరిగి మెట్లమార్గంలో చేరుకుని, రాత్రి ఆరాధన, పవళింపు సేవలను నిర్వహించారు.

ప్రధాన జంక్షన్‌లలో అసంపూర్తిగా బస్ షెల్టర్లు

ప్రారంభించి మూడేళ్లు- పూర్తికావడానికి ఎన్నేళ్లో?

పద్మనాభం, జనవరి 16: మండలంలోని పలు గ్రామాల్లో మూడేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించిన బస్సు షెల్టర్లు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రధాన జంక్షన్లలో ప్రయాణికులు వేచి ఉండేందుకు వీలుగా నిర్మాణం ప్రారంభించినప్పటికీ, అధికారుల అలసత్వంతో పూర్తికాక నిరుపయోగంగా పడిఉన్నాయి. చిన్నాపురం జంక్షన్, పద్మనాభం జంక్షన్‌లో ఒక్కోటి రూ.10లక్షల వ్యయంతో షెల్టర్ల నిర్మాణం కోసం నాటి పర్యాటక శాఖా మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు 2020 అక్టోబరు 10న శంకుస్థాపన చేశారు. కాగా పనులు ప్రారంభించిన గుత్తేదారు షెల్టర్లను శ్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు. అనంతరం పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందగా మారాయి. వీటి నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణికులకు వినియోగంలోకి రాలేదు. దీంతో వారంతా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రహదారులపైనే బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. కాగా పద్మనాభంలో నిర్మాణం బాగుండి, సేవలందిస్తున్న బస్‌షెల్టరును కూల్చి మరీ కొత్త షెల్టరు నిర్మాణం చేపట్టినా అది కూడా మధ్యలోనే నిలిచిపోయింది. మూడు నెలలలోపు పూర్తికావాల్సిన ఇలాంటి నిర్మాణాలు కూడా ఏళ్లు దాటుతున్నా పూర్తికాకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే వీటి నిర్మాణాలను పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.



చిన్నాపురం జంక్షన్‌లో అసంపూర్తిగా వదిలేసిన బస్ షెల్టర్



అప్పటి మంత్రి వేసిన శిలాఫలకం



పద్మనాభంలో నిర్మాణం మధ్యలో నిలిచిన బస్ షెల్టర్

కొబ్బరితోట పార్క్‌లో అలముకున్న అంధకారం

భీమునిపట్నం, జనవరి 16: భీమిలి బీచ్‌రోడ్డు కొబ్బరితోట పార్క్ మంగళవారం రాత్రి అంధకారం నెలకొంది. సంక్రాంతి కావడంతో చాలా మంది సందర్శకులు ఆహ్లాదంగా గడపడానికి ఈ పార్క్‌కు వచ్చారు. అయితే లైట్లు వెలగకపోవడంతో తీవ్రంగా నిరాశ చెందారు. పార్కు అందంగా కనిపించేలా ప్రతీ కొబ్బరిచెట్టుకు ఆకర్షణీయమైన లైట్లను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. ఈ కాంతులతో ప్రతీరోజు కొబ్బరితోట పార్క్ ఆకర్షణీయంగా కనిపించింది. మంగళవారం లైట్లు వెలుగకపోవడంతో అంధకారం రాజ్యమేలింది. దీంతో చాలా మంది అసంతృప్తితో వెనుదిరిగారు. జీవీఎంసీ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.



దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో కొబ్బరితోట పార్క్

అయ్యప్ప ఆలయాల్లో ఘనంగా మకరజ్యోతి ఉత్సవం

వెంకోజీపాలెం, జనవరి 16: మకర సంక్రాంతి సందర్భంగా కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు వైభవంగా జరిగింది. అనంతరం స్వామివారికి హారతిచ్చి జ్యోతి దర్శనాన్ని కల్పించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాశశర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, బాల భాస్కర శర్మ అయ్యప్పకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వీల రమణ, ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, ఆదారి కామేశ్వరరావు, ఎస్.నరసింహారెడ్డి, సూరిబాబు, సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.



భీమిలి సాగరతీరంలో కర్పూర మకరజ్యోతి దర్శనం

ఆరిలోవ: చినగదిలి అయ్యప్ప ఆలయంలో సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శబరిమల తరహాలో ఆకాశంలో మకర జ్యోతిని విడిచిపెట్టారు. ఆలయం ప్రాంగణమంతా అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. ఈ సందర్భంగా ట్రస్టీ వానపల్లి అప్పారావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి రోజున భక్తులకు మకర జ్యోతి దర్శనం కొనసాగిస్తున్నట్టు చెప్పారు. అనంతరం అయ్యప పడి పూజలను చేశారు. అయ్యప్పకు నెయ్యి, పాలతోను అభిషేకాలు చేశారు.

పద్మనాభం: మండలంలోని మద్ది అయ్యప్ప ధర్మశాస్త్రా పీఠంలో మకరజ్యోతి దర్శన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణేశ పూజ, సుబ్రహ్మణ్యస్వామి, లక్ష్మీదేవి, పరమేశ్వరులకు అ స్తోత్తర నామార్చన, అయ్యప్పకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పీఠం మేడపైన మకర జ్యోతిని వెలిగించి భక్తులకు దర్శనం కల్పించారు. ధర్మశాస్త్రా పీఠం అధ్యక్ష, కార్యదర్శులు రాం బాబు, సత్యనారాయణల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం స్థానిక పురోహితులు సామవేదం బదరికా వాసు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

భీమునిపట్నం: భీమిలిలో సోమవారం సంక్రాంతి సందర్భంగా లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. బీచ్‌రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో కర్పూర మకరజ్యోతి దర్శనం కార్యక్రమం ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో జరిగింది.



చినగదిలిలో మరజ్యోతిని వదులుతున్న దృశ్యం



మద్దిలో మకరజ్యోతిని వెలిగించిన భక్తులు

సంస్కృతి, సాగుకు ఆధారం గోమాత



గోవుకు పూజలు చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్టీలు

సింహాచలం, జనవరి 16: ధాన్యాగారంగా పేరొందిన భారతావనిలో సంస్కృతి, వ్యవసాయానికి ఆధారంగా గోమాత నిలుస్తుందని సింహాచల దేవస్థానం ఈవో సింగాల శ్రీనివాసమూర్తి అన్నారు. కనువ పండగను సింహాచల దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం నృసింహవనంలో మంగళవారం ఉదయం సంప్రదాయబద్ధంగా పాలకమండలి సభ్యులతో కలసి ఆయన గోపూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా అడివివరం గ్రామదేవత పైడితల్లమ్మ ఆలయ అర్చకులు సంతోష్‌శర్మ, ఆగమ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంతాచార్యులు, పండితులు కపిలవాయ్ నరసింహమూర్తి శర్మ, నవుడూరు వెంకటేశ్వరశర్మ, కిరణ్‌శర్మ లోకకల్యాణార్థం గోశాలలోని కపిలగోవుమాతకు షోడశాపచారాలను సమర్పించారు. తొలుత గోపాలుని (శ్రీకృష్ణుని)కి అష్టోత్తర శతనామావళితో విశేష అర్చన కావించారు. అనంతరం గోమాతలను పసుపు, కుంకుమలతో అలంకరించి భక్తులు పూజలు చేశారు. మినపగారెలు, బూరెలు, అరటిపండ్లు, ధాణాను నైవేద్యంగా తినిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కావించారు. గోపూజల్లో దేవస్థానం పాలకమండలి సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, గంట్ల శ్రీనుబాబు, పాలకమండలి మాజీ సభ్యులు రాగాల నరసింగరావు నాయుడు, దేవస్థానం సహాయ ఈవోలు భమరాంబ, వీబీవీ రమణమూర్తి, ఈఈ బీ రాంబాబు, డీఈ డీవీఎస్ రామరాజు(హరి), గోసేవా మండల్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారులు నిర్మానుష్యం



హనుమంతవాక జంక్షన్ వద్ద నిర్మానుష్యంగా రోడ్డు

ఆరిలోవ, జనవరి 16: నగర వాసులు సంక్రాంతి సందర్భంగా సొంతూళ్ల బాట పట్టారు. దీనితో నిత్యం రద్దీగా ఉండే హనుమతవాక నుంచి పెద గదిలి వెళ్లే రహదారి నిర్మానుషంగా మారింది. మళ్లీ 18వ తేదీన పల్లెలనుంచి నగరానికి జనాలు రానున్నారు.

తీరంలో వివాహిత ఆత్మహత్యా యత్నం

- కాపాడిన పోలీసులు

సాగర్‌నగర్, జనవరి 16: సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన వివాహితను పోలీసులు రక్షించారు. ఈ సంఘటన రుషికొండ బీచ్ వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పీఎంపాలేనికి చెందిన వివాహిత మంగళవారం ఉదయం రుషికొండ బీచ్ వద్దకు చేరుకుంది. తీరం నుంచి నెమ్మదిగా సముద్రంలోపలకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సీఎస్‌పీఎస్‌కు చెందిన హెచ్‌సీ కె.అరుణ గమనించారు. పరుగున వెళ్లి ఆమెను తనతో పాటు వెనక్కి తీసుకువచ్చి, పోలీసు అవుట్ పోస్టులో ఉంచారు. పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుల్ వీడీవీ ప్రసాద్ వచ్చి మహిళ నుంచి వివరాలను తెలుసుకుని, వారి బంధువులకు తెలిపారు. వారు వచ్చిన అనంతరం అప్పగించారు.

కనుమ సందర్భంగా నాటు కోళ్లకు డిమాండ్



నాటు కోళ్ల దుకాణం వద్ద కొనుగోలుదారులు

ఆరిలోవ, జనవరి 16: కనుమ పండగ మంగళవారం కావడంతో మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. నాటు కోడి మాంసం కిలో రూ. 800 ధర పలకడంతో ఎక్కువ మంది బ్రాయిలర్ కోళ్ల వైపు మొగ్గు చూపారు. బ్రాయిలర్ మాంసం కిలో రూ. 160 లభించింది. ఇక వేట మాంసం కిలో 900 నుంచి 1000 విక్రయించారు. పాత డెయిరీ ఫారం వద్ద గల నాటు కోళ్ల బజారులో ఈ మాంసానికి డిమాండ్ నెలకొంది. లైవ్ నాటు కోడి కిలో రూ. 600 , మాంసం రూ. 700 నుంచి రూ. 800 వరకు విక్రయించారు.

హెల్త్ ఎరీనాలో వీధి కుక్కల బెడద



నడక మార్గంలో కుక్కలు

ఎంవీపీ కాలనీ, జనవరి 16: అప్పుఘర్ నుంచి హనుమంతువాక వరకూ ఉన్న హెల్త్ ఎరీనాలో కుక్కల బెడద స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయపు నడక కోసం ఇక్కడకు చాలా మంది తెల్లవారు జామునే చేరుకుంటారు. నడక మార్గంలో కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. పరుగులు తీసేవారు, వేగంగా నడిచేవారు కుక్కలను చూసి ఆగిపోవాల్సి వస్తోంది. తెల్లవారుజామున, సాయంత్రం నడిచేవారికి మంచు, చీకటి వల్ల దారిలో ఉన్న కుక్కలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రశాంతంగా, పచ్చని చెట్ల మధ్య నడకతో సేద తీరుదామని వచ్చేవారంతా ఇబ్బంది పడుతున్నారు. నిర్వాహకులు ఈ సమస్య పట్ల స్పందించడం లేదని పాదచారులు వాపోతున్నారు. తక్షణం కుక్కలను తరలించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు



బీఆర్‌టీఎస్ రోడ్డులో చెట్లను నరికివేసిన దృశ్యం

ఎంవీపీ కాలనీ, జనవరి 16: విద్యుత్తు తీగెలకు కొమ్మలు తగలకుండా కొమ్మలను విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో తొలగించడం సాధారణం. కానీ చెట్లు మోడు అయ్యే రీతిలో భారీగా నరికేసినా చోద్యం చూస్తున్నారు. బి.ఆర్.టి.ఎస్. రోడ్డును ఆనుకుని హనుమంతువాక నుంచి ముడసర్లోవ వైపు తీగెల కింద చెట్ల కొమ్మలను నరికే ప్రక్రియ చేపట్టారు. అయితే ఓ లారీ ఏర్పాటు చేసుకుని కొమ్మల బదులు చెట్ల మోడు వరకూ నరికేసి, ఆ కలపను తరలించుకుపోతున్నారు. చెట్ల కొమ్మలు మాత్రమే తొలగించాల్సి ఉండగా, కలప అమ్ముకోవడం కోసం భారీగా కొట్టివేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. పచ్చని చెట్లు నరికేసి, పర్యావరణానికి హాని చేస్తున్నవారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.